

# మాయదారి ముసలిది

హారూనల్ రషీద్ బాగ్దాద్‌లో ఖలీఫాగా ఉండిన కాలంలో ఆ రాజ్యంలో పావురాల టపా నడిచింది. దాన్ని నడపటానికి ఖలీఫా ఒక సమర్థుణ్ణి నియమించి నెలకు వెయ్యి దీనారాల జీతం ఇచ్చాడు.

అయితే కొంతకాలానికి ఆ మనిషి చనిపోయాడు. అతనితోనే పావురాల టపా కూడా నిలిచిపోయింది. ఆ టపా నిమిత్తం ఏర్పాటయిన పావురాలూ, నలభైమంది నీగ్రో బానిసలూ, నలభై వేటకుక్కలూ ఖలీఫా వద్దకు తిరిగి వచ్చేశాయి.

ఆ పావురాల టపా నడిపినవాడికి దిలైలా అనే భార్యా, జీనాబ్ అనే కూతురూ ఉండేవారు. తన భర్త చనిపోగానే దిలైలా ఖలీఫాకు ఒక విజ్ఞాపన చేస్తూ, పావురాల టపా తాను నిర్వహించగలనని, తన భర్తకు ఇస్తూ ఉండిన జీతమే తనకూ ఇవ్వవలసిందనీ వేడుకున్నది. కాని ఆమె విజ్ఞాపనను ఖలీఫా తిరస్కరించాడు. దిలైలా శక్తిసామర్థ్యాలను ఆయన ఎరగడు.

ఇది జరిగిన కొద్ది రోజులకే ఖలీఫా ఇద్దరు ప్రసిద్ధులైన దొంగలను కొత్వాళ్ళుగా నియమించాడు. ఒకడు అహ్మద్, రెండో వాడు హసన్. వారిని పట్టటానికి విశ్వ ప్రయత్నాలు చేసి విఫలులై; అంత సమర్థత గల దొంగలు కొత్వాలు పనిని చక్కగా నిర్వర్తించగలుగుతారని ఖలీఫా భావించాడు.

తన విజ్ఞాపనను తోసిపుచ్చిన ఖలీఫా దొంగలకు గొప్పపదవు లిచ్చేసరికి దిలైలాకు చాలా ఆగ్రహం వచ్చింది. "ఈ దేశంలో దొంగలకూ, మోసగాళ్ళకూ గౌరవమర్యాదలు లభించే పక్షంలో, మనమేనా చేతగాని వాళ్ళం? ఈ హసన్‌గాని, అహ్మద్‌గాని నా ముందు ఎందుకూ పనికిరారని రుజువు చేస్తాను, చూసుకో!" అన్నదామె తన కూతురు జీనాబ్‌తో.

ఆర్. నాగభూషణం



దిలైలా వయసు మళ్ళినదే అయినా యుక్తిలో చాలా గట్టిది. జీనాబ్ కూడా తల్లికేమాత్రమూ తీసిపోదు. తల్లి అన్న మాటలకు ఆమె చాలా సంతోషించింది.

తన మాయలతో బాగ్దాద్ నగరాన్ని అట్టుడికించాలని దిలైలా నిశ్చయించింది. ఒకనాడామె మెడనిండా తావళాలూ, ముఖానికి ముసుగూ, చేతిలో సూఫీ బిచ్చగాళ్ళ జెండా ధరించి, సూఫీ సన్యాసిని అవతారంతో ఇంటి నుంచి బయలుదేరింది.

ముస్తఫా అనేవాడు బాగ్దాదులోని గొప్ప అధికార్లలో ఒకడు. అతను ఖలీఫా రక్షక దళానికి నాయకుడు. అతనికి పెద్ద జీతం ఉండేది. బ్రహ్మాండమైన చక్కని ఇల్లు ఉండేది. దానికి గంధం చెక్కతో చేసిన తలుపులూ, వెండి తాళాలూ ఉండేవి. ముస్తఫా ఐశ్వర్యానికి తగ్గట్టే అతనికి మంచి యవ్వనంలో ఉన్న, అందాలరాశి అయిన భార్య ఉండేది. ఆమె పేరు ఖాతూన్. ఆ భార్యను ముస్తఫా నెత్తిమీది దేవతలాగా చూసుకునేవాడు. అందుకే, ఆమె వల్ల తనకు సంతానం కలగకపోయినా అతను మరొక భార్యను కట్టుకోలేదు. అయితే, సాటి అధికారుల్లాగా తన వెంట దివానానికి తీసుకుపోవటానికి కొడుకులు లేరే అని లోలోపల బాధపడేవాడు.

పిల్లల కోసం తన భర్త కుమిలిపోతున్న సంగతి ఖాతూన్ ఎరుగును. అందుచేత తనకు పిల్లలు లేరన్న విచారంతో ఆమె కూడా బాధపడి, సంతానం కోసం ఎన్నో మందులు తిని, ఎన్నో తిప్పలు పడింది. అయితే ఆమె ప్రయత్నాలు ఫలించలేదు.


సూఫీ సన్యాసిని వేషంలో, "అల్లా! అల్లా!" అని కేకలు పెడుతూ, నగరం వీధుల వెంబడి తిరుగుతున్న దిలైలా, ముస్తఫా ఇంటి ముందుకు వచ్చి తల ఎత్తి చూసింది. మేడ మీద కిటికీ వద్ద నిలబడి ఉన్న ఖాతూన్ అంతులేని ఆభరణాలు

ధరించి, కొత్త పెళ్ళికూతురి లాగా వెలిగిపోతూ దిల్లైలా కంటపడింది.

"ఈ పిల్లను తీసుకుపోయి ఆ నగలన్నీ కాజెయ్యకపోతే నా ప్రజ్ఞ ఏమిటి?" అనుకున్నది దిల్లైలా.

దిల్లైలాను చూడగానే ఖాతూన్‌కు కూడా ఆశ కలిగింది. ఈ సూఫీ సన్యాసిని తనకేమైనా సంతానప్రాప్తి కలిగే మార్గం చెబుతుందేమో! ఆ సన్యాసినిని పిలుచుకు రమ్మని ఖాతూన్ ఒక దాసీని పంపింది.

దాసీది వెళ్ళి దిల్లైలాను మేడ మీదికి తెచ్చింది. ఖాతూన్ కళ్ళనీళ్ళు పెట్టుకుని దిల్లైలా కాళ్ళపైన పడి, తన సమస్య వెళ్ళబోసుకున్నది.



"నీదొక పెద్ద సమస్య కాదు. ఈ నగరంలోనే సంతాన సాధువొకాయన ఉన్నాడు. ఆయన దర్శనం చేసుకున్నావంటే నీ కోరిక తీరే ఉపాయం చెప్పగలడు." అన్నది దిల్లైలా.


ఖాతూన్ విచారంగా, "నే నెప్పుడూ ఇల్లు దాటి వెళ్ళినదాన్ని కాను," అన్నది.

"అలా అయితే నా వెంట రా. ఇప్పుడే నిన్నా సాధువు దగ్గిరికి తీసుకుపోతాను. నీ భర్త ఇంటికి తిరిగి వచ్చేలోపల నువ్వు వచ్చేద్దువుగాని." అన్నది దిల్లైలా.

తన కోరిక ఈడేరినట్టే భావించుకుని ఖాతూన్, తన కున్న మిగతా నగలు కూడా ధరించుకుని దిల్లైలా వెంట బయలుదేరింది.

ఇద్దరూ కొంతదూరం వెళ్ళేసరికి సిద్దీ మొహసిన్ అనేవాడి దుకాణం వచ్చింది. సిద్దీమొహసిన్ యువకుడు. అతని కింకా పెళ్లి కాలేదు. అతన్ని చూడగానే దిల్లైలాకు ఒక ఆలోచన కలిగింది. ఆమె ఖాతూన్‌ను బయటి అరుగు మీద కూర్చుని ఉండమని, తాను దుకాణంలోకి వెళ్ళింది.

ఆమె మొహసిన్‌తో, "చూడు, నాయనా, ఆ అరుగు మీద కూచున్న చక్కనిచుక్క



నా కూతురు. దానికి పెళ్ళియీడు వచ్చింది. నీ వంటి బుద్ధిమంతుడి కిచ్చి పెళ్ళి చేద్దామని నా ఉద్దేశం. దాని తండ్రి వర్తకం చేసి పుష్కలంగా సంపాదించాడు. నీకు బోలెడంత కట్నం ఇస్తాను. కావాలంటే ఇలాంటి దుకాణాలు మరి రెండు తెరవవచ్చు," అన్నది.

మొహసిన్ పరమానందభరితుడై, "ప్రధానం ఎప్పుడుచేస్తావు?" అన్నాడు.

"నా వెంట వచ్చావంటే ఇప్పుడే చేస్తాను," అన్నది దిలైలా.


మొహసిన్ దీనారాల సంచికట్టు చంకన పెట్టుకుని దిలైలా వెంట బయలుదేరాడు.

ఖాతూన్‌ను కూడా వెంటబెట్టుకుని వీధి వెంట నడుస్తుండగా దిలైలాకు హజీ ముహమ్మద్ అనే కలంకారీవాడి దుకాణం కనిపించింది.

ఆమె ఖాతూన్‌నూ, మొహసిన్‌నూ దూరంగా నిలిపి, తాను దుకాణం ప్రవేశించి, ముహమ్మద్‌తో, "అయ్యా, ఆ నిలబడ్డవాళ్ళు నా కొడుకూ, కూతురూనూ. మా ఇల్లు కూలిపోయేటట్టుగా వుంటే మరమ్మతు ప్రారంభించాం. అది పూర్తి అయేదాకా—నాలుగు రోజులపాటు—మేం ఉండటానికి, మీ ఎరికిన ఖాళీ ఇళ్ళేమైనా ఉన్నాయా?" అన్నది.

కలంకారీవాడు కొంచెం ఆలోచించి, "నే నుండే ఇంటి పై భాగం ప్రస్తుతం ఖాళీగానే ఉన్నది. తరుణమప్పుడు నీలిమందు వర్తకులు వస్తే ఉండటానికి అది ఉపయోగపడుతూ ఉంటుంది. నాలుగు రోజులపాటు మీరు కావలిస్తే వాడుకోండి." అన్నాడు, తాళపుచెవులు ఆమె కిస్తూ.

దిలైలా ఖాతూన్‌నూ, మొహసిన్‌నూ వెంటబెట్టుకుని హజీముహమ్మద్ ఇంటికి వెళ్ళి, కిందిభాగం తెరిచి, లోపలికి వెళ్ళమని మొహసిన్‌కు సైగచేసి, ఖాతూన్‌ను వెంటబెట్టుకుని మేడ మీదికి వెళ్ళి,



''అమ్మాయీ, నేను చెప్పిన సాధువు ఈ మేడ కింది భాగంలోనే ఉండేది. నేను వెళ్ళి ఆయనతో నీ విషయం చెప్పి ఇప్పుడే వస్తాను. ఈ లోగా నువ్వు నీ నగలన్నీ తీసి భద్రంగా మూటగట్టి, ఆ సాధువు దర్శనం చేసుకోవటానికి సిద్ధంగా ఉండు. ఆయన దగ్గిరికి అలంకరించుకుని వెళ్ళటం మహాపరాధం!'' అని చెప్పి కిందికి వెళ్ళిపోయింది.


ఆమె కిందికి రాగానే మొహసిన్, ''ఏమిటి, పెళ్ళిఖరారు అనుకుందామా?'' అని అడిగాడు.

దిలైలా నగలవిడుపు విడుస్తూ, ''నే నేం చేసేది, నాయనా? ఓర్వలేని దుర్మార్గులెవరో పిల్ల మనసు విరిచేశారు; నీకు తామర ఉన్నదనీ, బొల్లి ఉన్నదనీ దాన్ని నమ్మించారు. అది నిన్ను పెళ్ళాడనంటున్నది. ఒక పని చేద్దాం. నీ చొక్కా విప్పదీసి కూర్చో. దాన్ని తెచ్చి నిన్ను చూపి పెళ్ళికి ఒప్పిస్తా. నీ సంచీ, చొక్కా ఇలా తే, పైన భద్రంగా ఉంచుతాను,'' అన్నది.

మొహసిన్ ఆమె మాటలు నమ్మి, వెయ్యి దీనారాలున్న తన సంచీ, చొక్కా ఆమె చేతి కిచ్చాడు. వాటిని తీసుకుని దిలైలా మేడమీదికి వెళ్ళి, ఖాతూన్‌తో, ''నీ కోసం సాధువు ఎదురు చూస్తున్నాడు. నీ అదృష్టం బాగుంది. కిందికి పద. నీ నగల మూట దాచి నీ వెనకే నేనూ వస్తున్నాను,'' అన్నది.

ఖాతూన్ కిందికి దిగి లోపలికి వెళ్ళింది. దిలైలా ఆమె వెనకగా రెండు మూటలూ పట్టుకుని కిందికి దిగి, తిన్నగా వీధిలోకి వెళ్ళిపోయింది.

ఖాతూన్ కిందిభాగం లోపలికి వెళ్ళి, సాధువు కోసం చూస్తే, అతగాడు కనిపించలేదు. కాని మొహసిన్ కనిపించి, ''చూసుకో, నా వంటి మీద ఒక్క మచ్చ అయినా ఉన్నదేమో!'' అన్నాడు.



ఖాతూన్ బెదిరి, మళ్ళీ మేడమీదికి పరిగెత్తిపోయి, తలుపు వేసి గడియపెట్టుకున్నది. అక్కడ సూఫీ సన్యాసిని లేదు— తన నగలమూట కూడా లేదు!

దిలైలా తాను సంగ్రహించిన మూటలను తనకు తెలిసిన ఒక దుకాణంలో ఉంచి, కలంకారీవాడి దుకాణానికి వెళ్ళి, హజ్‌ముహమ్మద్‌తో, "బాబూ, ఇల్లు చాలా సుఖంగా ఉన్నది. మీరు చాలా పుణ్యం కట్టుకున్నారు. నేను సామాను తెచ్చుకోవటానికి మా ఇంటికి పోతున్నాను. పిల్లలిద్దరూ ఆకలి అంటున్నారు; ఈ దీనారం తీసుకుని, వాళ్ళ కేమన్నా తినటానికి పట్టుకు పోగలరా? వారితోపాటు మీరు కూడా ఫలహారం చెయ్యండి." అన్నది.

హజ్‌ముహమ్మద్, ఆమె ఇచ్చిన దీనారం అందుకుని, తన పనివాణ్ణి దుకాణం చూస్తూ ఉండమని, బయలుదేరాడు. దిలైలా కూడా తాను దాచిఉంచిన మూటలు తీసుకుని, కలంకారీ దుకాణానికి తిరిగి వచ్చి, ఆ దుకాణం చూస్తున్న పనివాడితో, "మీ యజమాని రొట్టెల దుకాణంలో ఉన్నాడు. నిన్ను వెంటనే రమ్మన్నాడు. వెళ్ళు నాయనా! నువు తిరిగి వచ్చేదాకా దుకాణం నేను చూస్తూ ఉంటాలే!" అన్నది.

పనివాడు ఆమె మాట నమ్మి వెళ్ళిపోయాడు.

దిలైలా ఆ దుకాణంలో కదిలించటానికి వీలైనదెల్లా ఎత్తి ఒక పక్కగా పెట్టింది. దుకాణం ముందుగా ఒక మోతగాడిదను తోలుకుంటూ ఒక కుర్రాడు వెళుతుంటే వాణ్ణి పిలిచి, "చూడు బాబూ? నీకీ దుకాణంవాడు తెలుసుగా? వాడు నా కొడుకే. మా వాణ్ణి అప్పులవాళ్ళు పట్టుకుపోయారు. ఈ సామానంతా ఊళ్ళోవాళ్ళది. వాళ్ళది వాళ్ళ కిచ్చెయ్యాలి. దీన్ని నీ గాడిద మీద వేసి నా వెంట పంపిస్తావా? ఇదుగో, ఈ దీనారం ఉంచు. నేను తిరిగి



వచ్చేలోగా నీలిమందు సీసాలూ, కర్ర సామగ్రీ విరగ్గొట్టెయ్యి. లేకపోతే జప్తు చేస్తారు." అన్నది.

గాడిదగల కుర్రవాడు ఒప్పుకున్నాడు.

దిల్లైలా సామానంతా గాడిద మీద వేసుకుని, తన ఇంటికి వెళ్ళిపోయింది.

తల్లిని చూడగానే జీనాబ్, "అమ్మా, ఏం చేసుకొచ్చావు?" అని అడిగింది.

"నలుగురి కళ్ళలో దుమ్ముకొట్టాను. ఈ నగలు ఒక అధికారి భార్యవి. ఈ దీనారాల సంచీ, చొక్కా ఒక దుకాణదారువి. ఈ సరుకంతా ఒక కలంకారీ వాడిది. ఈ గాడిద నాలుగో వాడిది," అన్నది దిల్లైలా గర్వంగా.

"చేసిందేదో బాగానే చేశావుగాని, ఇక ఇల్లు కదలకు. వాళ్ళు నలుగురూ నీ కోసం గాలిస్తూ ఉంటారు," అన్నది జీనాబ్.

"అప్పుడే ఏమయిందే, పిచ్చిదానా? ఉన్నదంతా ముందే ఉన్నది," అన్నది దిల్లైలా.

అక్కడ కలంకారీవాడు రొట్టెల దుకాణంలో రొట్టెలూ, కూరా కొంటూండగా, పనివాడు వచ్చి, "ఎందుకు రమ్మన్నారు?" అని అడిగాడు. తాను పిలిచినట్టు ముసలిది పనివాడితో ఎందుకు చెప్పవలిసి వచ్చిందో తెలీక, కలంకారీవాడు తన దుకాణానికి వచ్చేసరికి, గాడిద గల కుర్రాడు దుకాణాన్ని ధ్వంసం చేసేస్తూ కనిపించాడు.

"ఇదేం పనిరా నిన్ను 'పగలగొయ్యా!'" అన్నాడు కలంకారీవాడు.

"మిమ్మల్ని బాకీదార్లు వదిలేశారా ఏం?" అన్నాడు గాడిద గల కుర్రవాడు.

ఒకరనేది మరొకరికి చాలాసేపు అంతు బట్టలేదు. చిట్టచివరకు, సంగతి కొంత బుర్రకెక్కి, కలంకారీవాడు, "ఆ ముసలిది ఏమైనట్టు?" అని అడిగాడు.

"నా గాడిద మాటేమిటి?" అన్నాడు కుర్రాడు.

ఇద్దరూ లబ్బున మొత్తుకుంటూ ఉండటం చూసి జనం పోగయారు. అందరూ కలిసి కలంకారీవాడి ఇంటికి వెళ్ళారు.

కలంకారీవాడు తలుపు తట్టగా మొహసిన్ చొక్కా లేకుండా వచ్చి తలుపు తెరిచాడు.

"దొంగవెధవా! మీ అమ్మ ఎక్కడ?" అని కలంకారీ అరిచాడు.

"మా అమ్మ ఎప్పుడనగా పోయింది!" అన్నాడు మొహసిన్.

ఒకరి గొడవ ఒకరికి అర్థం కావటానికి కొంతకాలం పట్టింది.

"ఆ ముసలిది నాకు తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తానని తీసుకొచ్చింది. తల్లీ కూతుళ్ళు మేడమీద ఉన్నారు." అన్నాడు మొహసిన్ చివరకు.

కలంకారీవాడు పైకి వెళ్ళి, తలుపు తట్టితే ఖాతూన్ తలుపు తెరిచింది.

"మీ అమ్మ ఎక్కడ?" అన్నాడు కలంకారీవాడు.

"మా అమ్మ ఎప్పుడనగా పోయింది!" అన్నది ఖాతూన్.

నలుగురూ తలలు చేర్చినమీదట జరిగిన మోసంయొక్క అసలు స్వరూపం క్రమంగా తెలియవచ్చింది. ఖాతూన్‌ను ఆమె ఇంటికి చేర్చి, మిగిలిన ముగ్గురూ నగర రక్షకుడైన ఖాలిద్ వద్దకు వెళ్ళి, జరిగినదంతా తెలిపారు.

ఖాలిద్ అంతా విని, "ఇంత పెద్ద నగరంలో ఎందరో ముసలమ్మలున్నారు. అందులో మీ ముసలిదాన్ని ఎలా పట్టుకొనేది? మీరే దాన్ని ఎలాగైనా పట్టి తెచ్చారంటే, దాన్ని తప్పక శిక్షిస్తాను," అన్నాడు.

తప్పేది లేక, మోసపోయిన ముగ్గురూ దిలైలా కోసం వెతుకుతూ నగరం మూడు దిక్కులకూ బయలుదేరారు.

—(ఇంకా వుంది)





# మాయదారి ముసలిది

## 2

ఈలోగా దిల్లైలా తాను ధరించిన సూఫీ భిక్షుకురాలి వేషం తీసేసి, ఒక భాగ్యవంతుల పరిచారిక లాగా దుస్తులు వేసుకుని, తన చాకచక్యంతో బాగ్దాదునగరాన్ని అట్టుడికించడానికి మళ్ళీ ఇంటినుంచి బయలుదేరింది.

ఆమె ఒక సందులోకి తిరిగేసరికి ఒక ఇంట చాలా కోలాహలంగా ఉన్నది. లోపల మేళతాళాలూ, పాటలూ సాగుతున్నాయి. దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. వీధివాకిట ఒక మనిషి ఒక చిన్న కుర్రవాణ్ణి ఎత్తుకుని నిలబడి ఉన్నది. వాడి వంటి నిండా వెండి, బంగారు జరీగల దుస్తులూ, రత్నాలు పొదిగిన ఆభరణాలూ, ముత్యాల చేర్లూ ఉన్నాయి.

ఆ ఇల్లు బాగ్దాదు వర్తకుల పెద్దది. లోపల ఆయన కుమార్తెకు ప్రథానం చేస్తున్నారు. వర్తకుడి భార్య పేరంటాళ్ళకు ఆతిథ్యం ఇవ్వాలంటే వీలు కాకుండా ఆమె చిన్నకొడుకు మారాం చెయ్యసాగాడు. అందుచేత ఆమె తన కొడుకును బానిసదాని కిచ్చి, అతిథులు వెళ్ళిపోయిన దాకా ఆడిస్తూ ఉండమన్నది. ఈ విషయాలన్నీ దిల్లైలా వీధిలోనే ఆరాతీసి, ఆ కుర్రవాడి వంటిమీది నగలు కాజేయాలని సంకల్పించింది.

ఆమె వీధి జనాన్ని తోసుకుంటూ బానిసను సమీపించి, "నా ఇల్లు బంగారం కానూ, ఆలస్యం కానే అయింది!" అని గట్టిగా అని, ఒక చెల్లని నాణెం తీసి బానిసదాని చేతిలో పెట్టి, "మీ పాత దాది ఉమాల్ ఖయర్ సలాములు చెప్పవచ్చిందని అమ్మగారికి చెప్పిరా, తల్లీ!" అన్నది.

బానిస నాణెం తీసుకుంటూ, "అమ్మగారు కనిపిస్తే అబ్బాయిగారు కొంగు పట్టు

ఆర్. నాగభూషణం



కుని వదలక మారాం చేస్తారు. నే నెలా వెళ్ళేదమ్మా?" అన్నది.

"చిట్టితండ్రిని నేను పట్టుకుంటాలే!" అన్నది దిలైలా.

బానిస ఈ మాటలు నమ్మి పిల్లవాణ్ణి దిలైలా కిచ్చి, లోపలికి వెళ్ళిపోయింది.

వెంటనే దిలైలా ఆ పిల్లవాడితో సహా నిర్జనంగా ఉన్న ఒక గొందిలోకి వెళ్ళి, వాడి వంటి మీద ఉన్న నగలూ, బట్టలూ ఊడ్చేసి, వాణ్ణి తీసుకుని ఒక పెద్ద రత్న వర్తకుడి దుకాణానికి వెళ్ళింది.

ఆ వర్తకుడు వర్తకులపెద్ద యొక్క కొడుకును గుర్తించి, మంచి బేరం తగిలిందనుకుని, "మీ యజమానికి ఏం కావాలి?" అని దిలైలాను అడిగాడు.

"ఈ పిల్లవాడి అక్కకు ప్రధానం చేస్తున్నారు. ఒక జత బంగారు గాజులూ, రెండు జతల బంగారు పాంజేబులూ, వరహాల చెవి కమ్మలూ, నగిషీవడ్డాణమూ కావాలి. అంతా కలిసి వెయ్యిదీనారాలకు తక్కువ కాకుండా ఇప్పించండి. సరుకు తీసుకుపోయి అమ్మగారికి చూపించి, నచ్చితే డబ్బు తీసుకుని ఇప్పుడే వస్తాను. అంతదాకా అబ్బాయిని ఇక్కడే ఉంచిపోతాను," అన్నది దిలైలా.

"అబ్బాయిని ఉంచనవసరం లేదు. ఉంచాలని ఉంటే ఉంచు," అని వర్తకుడు ఆమె కోరినవన్నీ ఇచ్చాడు. వాటిని తీసుకుని దిలైలా తిన్నగా తన ఇంటికి వెళ్ళిపోయింది.

అక్కడ వర్తకులపెద్ద ఇంటికి చేరేసరికి ఇల్లు భీభత్సంగా ఉన్నది. ఆయన భార్య కిందపడి దొర్లుతూ పుక్కెడు దుఃఖంలో ఉన్నది. పిల్లవాడు కనబడటం లేదు. వర్తకుడు ఎంతో ప్రయాసపడి వెతికించగా వాడు నగల వర్తకుడి దుకాణంలో దొరికాడు.

"దొంగ వెధవా, నా పిల్లవాణ్ణి ఇక్కడ పెట్టావా? వాడి వంటి మీద నగలూ, దుస్తులూ ఎక్కడ?" అని అడిగాడు వర్తకుల పెద్ద.



"నేను తమ ఇంటికి పంపిన వెయ్యి దీనారాల నగల మాటేమిటి?" అన్నాడు నగలవర్తకుడు.

ఒకరి గొడవ ఒకరికి అర్థం కావటానికి చాలాసేపు పట్టింది. వాళ్లు ఘర్షణ పడుతుండగా, దిలైలా చేత మోసపోయిన ముగ్గురూ అక్కడికి వచ్చారు. ఒకరి సంగతి ఒకరు విన్నాక, అందరినీ మోసగించినది ఒకతేనని తెలిపోయింది.

"ఆ ముండ అంతు తేల్చకుండా నేను నిద్రపోను," అన్నాడు వర్తకుల పెద్ద.

"ఆ ముసలిదాన్ని పట్టటానికి నేను కూడా మీతో వస్తాను," అన్నాడు నగల వర్తకుడు.

కాని ఎలా వెతకాలి? అందరూ కలిసి కట్టగా వెళ్ళి లాభం లేదు. అందరూ తలా ఒక దిక్కూ వెళ్ళిపోయి, మధ్యాహ్నాని కల్లా హజ్ మసూద్ అనే మంగలి పెట్టిన దుకాణం దగ్గిర కలుసుకునేటట్టు ఏర్పాటు చేసుకున్నారు.

మధ్యాహ్నంవేళకు గాడిద గల కుర్రవాడు మంగలి దుకాణం కేసి వస్తూండగా వాడికి దిలైలా కనిపించింది. వేషం మారినా వాడు ఆమెను గుర్తుపట్టి, "దొరికావా, దొంగ పీనుగా!" అన్నాడు.

"అదేమిటి, నాయనా?" అన్నది దిలైలా అమాయికంగా.

"నా గాడిద! నా గాడిదను నాకిచ్చి మరీ మాట్లాడు," అన్నాడు కుర్రవాడు.

"ఎందుకలా అరుస్తావు? నీ గాడిదను నేను కాజేశా ననుకుంటున్నావా? మంగలి మసూదు దగ్గిర ఉంచాను. మాట్లాడకుండా, నా వెంటరా, నీ గాడిదను నీకు ఇప్పిస్తా," అన్నది దిలైలా.

ఇద్దరూ మంగలి దుకాణం చేరారు. కుర్రవాణ్ణి బయటే ఉండమని, దిలైలా లోపలికి వెళ్ళి మసూదుతో, "నువ్వే కాపాడాలి, నా తండ్రీ!" అన్నది.



"ఏమిటి, పిన్నమ్మా? అసలు సంగతి చెప్పు," అన్నాడు హజ్‌మసూద్.

"ఆ బయట ఉన్నాడే, వాడు నా కొడుకు, నాయనా. జ్వాయిలా పడి, చచ్చి బతికాడు. కాని వాడి బుద్ధి పుచ్చిపోయింది. చిన్నప్పుడు వాడికొక గాడిద ఉండేది. దానికోసం వాడిప్పుడు ఒకటే కలవరింత! గాడిదో, గాడిదో అంటాడు. వాడి పిచ్చి నువే వదలగొట్టాలి," అన్నది దిలైలా.

మంగలి దిలైలా నుంచి దీనారం తీసుకుంటూ, "అదెంత పని? తల గొరిగేసి నిమ్మరసం అంటానంటె, మూడు పూటల్లో గుణం ఇస్తుంది," అన్నాడు.

"మంచి మాటలతో వాణ్ణి పిలిచి, వైద్యం చెయ్యి, నాయనా. నీ రుణం ఉంచుకోనులే," అన్నది దిలైలా.

మసూద్ దుకాణం బయటికి వచ్చి, కుర్రవాణ్ణి చూసి, "లోపలికి రా," అన్నాడు.

"నా గాడిద?" అన్నాడు కుర్రవాడు.

"నీ గాడిద ఎక్కడికి పోతుంది. అది నా దగ్గిర ఉన్నది లే! ఒక క్షణం లోపలికి రా!" అన్నాడు మంగలి.

కుర్రాడు వసారాలోకి అడుగు పెట్టగానే మసూద్ నౌకర్లు వాణ్ణి పట్టుకుని, పెడరెక్కలు విరిచి కట్టారు. మసూద్ వాడి తల నున్నగా గొరిగి, నిమ్మ రసం మర్దన చేశాడు. కుర్రవాడు పెద్ద పెట్టున కేకలు పెట్టాడు.

మసూద్ చికిత్స ముగించి లోపలికి వెళ్ళే సరికి ముసలిది లేదు సరేకదా, దుకాణానికి సంబంధిన కత్తులూ, కత్తెరలూ, అద్దాలూ, తల నూనెలూ, మర్దన తైలాలూ, అత్తరులూ, కుర్చీలూ, బల్లలూ మాయమయాయి.

మసూద్ కుర్రవాడి దగ్గిరికి వచ్చి, వాడి పీక పట్టుకుని, "మీ అమ్మ ఎక్కడరా, పిశాచంగాడా?" అని అడిగాడు.

"మా అమ్మ పోయి ఎంత కాలమాయె! నా గాడిదను ఇస్తానన్నావు. ఇచ్చెయ్యి." అన్నాడు కుర్రవాడు, తల నిమురుకుంటూ.

ఈ సమయంలో మిగిలిన వాళ్ళుకూడా అనుకున్న ప్రకారం దుకాణం చేరుకున్నారు. జరిగినదంతా విన్నాక, ముసలిది మంగలి మసూద్‌ను కూడా మోసగించినట్టు స్పష్టమయింది. ముసలిదాన్ని పట్టుకునేటందుకు బయలుదేరిన జట్టులో మసూద్ కూడా చేరాడు.

వాళ్ళు వీధుల వెంబడి తిరుగుతూండగా, గాడిదగల కుర్రవాడికి దిలైలా మళ్ళీ కనిపించింది. వాడు చప్పున ఆమెమీద పడి పట్టుకుని, "ముసలిముండ దొరికింది! ఈ సారి తప్పించుకు పోనివ్వకండి," అని బిగ్గరగా అరిచాడు.

అందరూ కలిసి దిలైలాను పట్టుకుని ఖాలిద్ ఇంటికి తీసుకుపోయి, అక్కడి భటులతో, "మేము వెంటనే ఖాలిద్‌గారి దర్శనం చెయ్యాలి," అని చెప్పారు.

ఖాలిద్ నిద్రపోతున్నాడని, ఆయన లేచేదాకా వాళ్ళు వేచి ఉండవలిసి ఉంటుందని భటులు చెప్పారు. వాళ్ళు మగవారిని ఆవరణలో కూర్చోమని, దిలైలాను జనానాలోని ఒక గదిలోకి పంపించారు.

దిలైలా ఆ గదిలో ఉండిపోక, ఇంకా లోపలికి వెళ్ళి, అనేక గదులు దాటి, మేడ మీద ఖాలిద్ భార్య ఉండే గదికి వెళ్ళింది. ఆమె ఖాలిద్ భార్యకు సలాం చేసి,





"మా బానిసలను మీ భర్తగారు పన్నెండు వందల దీనారాలకు బేరం చేశారు. వాళ్ళను అప్పగించటానికి తెచ్చాను. ఆయన నిద్ర పోతున్నట్టు తెలిసింది. వారు లేచేసరికి ఏవేళ అవుతుందో?" అన్నది.

"ఆ సంగతి నాకు తెలియదుగాని, బానిసలను కొనాలని మాత్రం వారు నాతో ఎప్పుడో అన్నారు. ఇంతకూ మీ బానిస లెక్కడ?" అని అడిగింది ఖాలిద్ భార్య.

"బయట ఉన్నారు. కిటికీలో నుంచి చూస్తే కనిపిస్తారు. అందరూ మంచి పుటక గలవాళ్ళేలెండి. అందుకు సందేహం అక్కర్లేదు." అన్నది దిలైలా.

ఖాలిద్ భార్య కిటికీలో నుంచి చూసింది. బయట నిలబడిన వాళ్ళు ఆమెకు తృప్తికరంగానే ఉన్నారు. ఆమె దిలైలాతో, "డబ్బు నేనే ఇద్దును, కాని నా దగ్గర ప్రస్తుతం వెయ్యిదీనారాలే ఉన్నాయి. ఏం చేసేది?" అన్నది.

"వెయ్యి చాలుగదండీ? రెండువందలు ముందే బయానాగా తీసుకున్నానుగా?" అన్నది దిలైలా.

ఆమె ఖాలిద్ భార్య నుంచి వెయ్యి దీనారాలూ తీసుకుని సలాం చేసి, "కూర్చో బెట్టకుండా నా పని పూర్తిచేసి చాలా పుణ్యం కట్టుకున్నారు. నాకు మా బానిసల ముఖాలు చూడటానికి చాలా బాధగా ఉంది. మీరు మరోలా అనుకోక, నన్ను దయచేసి దొడ్డి దారిన పంపెయ్యండి." అన్నది.

ఖాలిద్ భార్య దిలైలాను దొడ్డిదారిన పంపేసింది.

ఖాలిద్ నిద్రలేవగానే ఆమె ఆయనతో, "మొత్తానికి మంచి బేరమే చేశారే!" అంటూ బానిసల సంగతి అంతా చెప్పి అభినందించింది.

ఖాలిద్ అంతా విని ఆశ్చర్యపోయి, "బానిస లేమిటి? బేర మేమిటి? నే నెవరికీ బయానా ఇవ్వలేదే!" అన్నాడు.

"అదేమిటి? నే నా ముసలావిడకు వెయ్యిదీనారాలూ ఇచ్చేశాను. ఆమె మనకు అమ్మిన బానిసలు కింద వున్నారు," అన్నది ఖాలిద్ భార్య.

ఖాలిద్ కిందికి వెళ్ళి, దుకాణదారునూ, కలంకారీవాళ్ళనీ, రత్నాల వర్తకుణ్ణీ, మంగలి మసూద్‌నూ, గాడిదగల కుర్రవాణ్ణీ చూసి ఆశ్చర్యపడి, "మీరేనా నేను కొన్న బానిసలు?" అని అడిగాడు.

"ఇదేనా మీరు మాకు చేసే న్యాయం? మేము బానిసలమా? ఖలీఫాగారి నడుగుదాం పదండి," అన్నారు వాళ్ళు.

అదే సమయానికి ముస్తఫా కూడా అక్కడికి వచ్చాడు ఈ సరికి, ఆయనకు ముసలిది తన భార్యకు చేసిన మోసం గురించి తెలిసింది. ఆయన ఖాలిద్‌తో, "మీ నిర్వాహం కింద ప్రతి ముసలితొత్తూ యధేచ్ఛగా ఏ కొంపలో నైనా జొరబడి అమాయక స్త్రీలను మోసగించవచ్చులా కనబడుతుందే! నా భార్యకు జరిగిన మోసానికి ఏమి సంజాయిషీ ఇస్తారు?" అని అడిగాడు.

ఖాలిద్ బెదిరిపోయి, "అయ్యా, ఈ ముసలిదాన్ని శిక్షించే భారం నేను మీద వేసుకుంటాను. మీ అందరికీ దానివల్ల కలిగిన నష్టానికి పరిహారం ఇచ్చుకునే పూచీ కూడా నాదే!" అని, మిగిలినవాళ్ళ కేసి తిరిగి, "మీలో ముసలిదాన్ని గుర్తించగల వారెవరు?" అని అడిగాడు.

"మా వెంట పదిమంది భటులను ఇచ్చారంటే దాన్ని పట్టి తెస్తాం!" అన్నారు వాళ్ళు ఖాలిద్‌తో.

వారు భటులను వెంటబెట్టుకుని కొద్ది దూరం వెళ్ళేసరికే దిలైలా వారికి ఎదురుపడి, వారిని చూసి పారిపోబోయింది. కాని వారు వెంట తరిమి ఆమెను పట్టుకుని, చేతులు వెనక్కు విరిచి కట్టి ఖాలిద్ వద్దకు తీసుకుపోయారు. దిలైలా ఆట కట్టినట్టే కనబడింది.

—(ఇంకా వుంది)





# మాయదారి ముసలిది

## 3

ఖాలిద్ దిలైలాను ఆమె చేసిన దొంగతనాలను గురించి ప్రశ్నించాడు.

"మీ రడిగేది నా కేమీ అర్థం కావటం లేదు. నేను నా జన్మలో దొంగతన మన్నది చేసి ఎరగను." అన్నది దిలైలా.

అప్పటికే పొద్దు గూకింది. ఆ రోజుకు ఆమెను విచారణ చేసే అవకాశం లేదు. ఆమె మీద ఆరోపణలు చూడబోతే చాలా ఉన్నాయి. సాక్షులు కూడా చాలా మంది ఉన్నారు. ఆమె వాలకం చూస్తే ఒకంతట నేరాలను ఒప్పుకునేటట్టు కనబడలేదు. అందుచేత ఖాలిద్ ఆమెను ఆ రాత్రి అంతా చీకటికొట్టులో ఖైదు చేసి ఉంచి, తెల్లవారి విచారణ జరపనిశ్చయించాడు.

కాని జైలు అధికారి ఆమెను గురించి బాధ్యత వహించటానికి ఒప్పుకోక, "ఈమె పెద్ద మోసకారి. ఏదో ఉపాయం చేసి ఖైదు నుంచి తప్పించుకుపోతే నా పీక పోతుంది." అన్నాడు.

"అదీ నిజమే. విచారణ జరిగేదాకా, ఈ ముసలిదాన్ని నలుగురికీ కనిపించే చోటనే ఉంచి కాపలాకాయటం మేలు," అన్నాడు ఖాలిద్.

ఆయన గుర్రం మీద బయలుదేరాడు. ఫిర్యాదీలు అయిదుగురూ, దిలైలాను ఈడ్చుకుంటూ, ఆయన వెనకనే నగరం వెలపలకు వెళ్ళారు. అక్కడ బయలు ప్రదేశంలో దిలైలాను ఒక స్తంభానికి కట్టేయించి, ఫిర్యాదీలను అయిదుగురినీ ఆమెను కాపలాకాయమని చెప్పి, ఖాలిద్ తన ఇంటికి వెళ్ళిపోయాడు.

అయిదుగురూ ఆమె చుట్టూ కూర్చుని, చాలాసేపు ఆమెను నానాతిట్లూ తిట్టి, తమ కసి కొంత తీర్చుకున్నారు. అయితే భోజ

ఆర్. నాగభూషణం



నాలు చెయ్యగానే వారికి నిద్ర ముంచు కొచ్చింది. ఎందుకంటే, మూడు రాత్రులుగా వారికి నిద్ర అన్నది లేదు.

అర్ధరాత్రి దాటి చాలా సేపయింది. ఆ సమయంలో ఇద్దరు ప్రయాణీకులు చెరొక పక్క నుంచీ వస్తూ ఆ ప్రాంతంలో కలుసుకున్నారు. ఒకడు నగరం నుంచి వెళ్ళిపోతున్నవాడూ, రెండోవాడు నగరం చేరుతున్నవాడూనూ. వారిద్దరూ మాట్లాడుకున్న మాటలు దిలైలాకు వినిపించాయి.

"బాగ్దాదులో పొందదగిన అనుభవాలలో అన్నిటినీ మించినది ఏమిటి?" అని వచ్చేవాడు వెళ్ళేవాణ్ణి అడిగాడు.

"మీగడ పూసిన తేనెరొట్టెలు! నేనీ నగరంలో ఉన్న మూడు రోజులూ అవే తిన్నాను. ఏదైనా మొహం మొత్తవచ్చు గాని, ఇవి మాత్రం మొహం మొత్తవు. ఎంత తిన్నా ఇంకా తినాలనే అనిపిస్తుంది." అన్నాడు వెళ్ళేవాడు.

"భేష్! డబ్బు చూడకుండా, నేనీ నగరంలో ఉన్నన్నాళ్ళూ మీగడ పూసిన తేనెరొట్టెలే తింటాను." అన్నాడు వచ్చేవాడు.

వెళ్ళేవాడు ముందుకు సాగిపోయాడు. వచ్చేవాడు, దిలైలా స్తంభానికి కట్టేసి ఉన్న దిక్కుగా వచ్చాడు.

ఈ లోపల, సంభాషణ అంతా విన్న దిలైలా అప్పటికప్పుడే ఒక ఎత్తు ఆలోచించింది. ఆ ఎత్తు పారితే తాను తప్పించుకు పారిపోవచ్చు. ఆ వచ్చేవాడు పరదేశి. వాడికి తాను ఎవరో, తన కథ ఏమిటో తెలియదు. అందుచేత వాడు తేలికగా మోసపోయే అవకాశం వుంది.

"నాకు వద్దు! నేను తినను!" అనటం ఆరంభించింది దిలైలా.

ఆ మనిషి ఆమెను సమీపించి, "ఏమిటమ్మా? ఎవరు నువ్వు? నిన్నెందుకిలా కట్టిపెట్టారు? ఏమిటి తిననంటున్నావు?" అని అడిగాడు.

"ఏం చెప్పేది, నాయనా? నా భర్త తేనె రొట్టెలు తయారు చేసి, వాటిమీద మీగడ పూసి అమ్మి, లక్షలు గడించాడు. మొదట్లో నా కవి అంటే ఇష్టంగానే ఉండేది కాని, రానురాను వాటి పేరు చెబితేనే వాంతి అయే పరిస్థితి ఏర్పడింది. మొన్న మా దుకాణానికి ఒక గొప్ప అమీరు వచ్చాడు. అప్పుడు నా భర్త, ఆ అమీరుతో బాటు నన్ను కూడా తేనె రొట్టెలు తినమని నిర్బంధించాడు. నేను వాటిని నోట పెట్టుకో బోయేసరికే వాంతి అయినంత పని అయింది. ఆ అమీరుకు అనుమానం వచ్చి, తేనె రొట్టెలు తినకుండానే వెళ్ళిపోయాడు. నా భర్తకు డబ్బు నష్టం రావటంతోబాటు, తయారు చేసిన సరుకంతా వృథా అయిపోయింది. కాని తప్పు నా భర్తది. ఆయన నన్ను తేనె రొట్టెలు తినమని ఉండరాదు. అయినా, తప్పు నా మీదికే నెట్టి, నేను తన వ్యాపారాన్ని పాడు చేశానని నామీద ఫిర్యాదు చేశాడు. న్యాయాధికారి నాకు తేనె రొట్టెలు తినే శిక్ష విధించి, ఇక్కడ కట్టి పెట్టించాడు. తెల్లవారుతూనే రాజభటులు తేనె రొట్టెలు తెస్తారు. అవి, అందరూ చూస్తూండగా నేను తినాలి. తినేదాకా నాకు భోజనం పెట్టరు. నా కష్టాలు ఎందు కడుగుతావు, నాయనా?" అన్నది దిల్లైలా.





"అయ్యో, అవ్వా! పాపం, నీకెంత కష్టం వచ్చింది! అలాటి కష్టం నాకు రాకూడదూ?" అన్నాడు పరదేశి.

"అదేం భాగ్యం, నాయనా? నా కట్లు విడిపించి, నా స్థానంలో నువు నిలబడి, నా చేత కట్టించుకుని, నాలాగే ముఖం మీద ముసుగు వేసుకున్నావంటే, ఇంకాస్సేపట్లో తనె రొట్టెలు తెచ్చి, నిన్ను చూసి నేనే అనుకుని, మీగడతోసహా వాటిని నీచేత బల వంతాన తినిపిస్తారు!" అన్నది దిలైలా.

ఈ మాటలు నమ్మి పరదేశి ఆమె కట్లు విప్పాడు. దిలైలా అతన్ని స్తంభానికి కట్టి, అతని ముఖాన ముసుగు వేసి, అతను ఎక్కి వచ్చిన గుర్రం మీదనే ఎక్కి, బాగ్దాదు నగరంలోకి వెళ్ళిపోయింది.


తెల్లవారగానే ఫిర్యాదీలు అయిదుగురూ నిద్రలేచి, స్తంభానికి కట్టి ఉన్నది దిలైలాయే అనుకుని, ఆమెను కసితీరా మళ్ళీ తిట్ట నారంభించారు.

ఈ తిట్లు కొంచెంసేపు విని, స్తంభానికి కట్టి ఉన్నవాడు, "ఇంతకూ తనె రొట్టెలు రావేం?" అన్నాడు.

వాడి గొంతు విని నిర్ఘాంతపోయి, ఆ అయిదుగురూ వాడి ముఖం మీది ముసుగు తొలగించి చూశారు. ముసలిది మరోసారి తమ కళ్ళలో దుమ్ము కొట్టిందని వాళ్ళకు అర్థమయింది.

కొంతసేపటికి ఖాలిద్ స్వయంగా అక్క డికి వచ్చి, జరిగిన మోసం గురించి తెలుసు కున్నాడు. ఇది తనవల్ల తీరే ఫిర్యాదు కాదని అతనికి తోచింది. అతను అందరినీ వెంట బెట్టుకుని తిన్నగా ఖలీఫా వద్దకు వెళ్ళాడు.

ఖలీఫా హరూనల్ రషీద్ అందరి కథలూ విని, ఎవరికెవరికి ఎంతెంత నష్టం కలిగితే అంతా తాను సరి చేస్తానని మాట ఇచ్చాడు. అయినా ముసలిదాన్ని పట్టుకోవలసిన అవ సరం ఉన్నది. ఆ భారాన్ని ఖలీఫా ఖాలిద్ పైనా, ముస్తఫా పైనా వేశాడు.



ఆమెను పట్టటం నావల్ల అయే పని కాదు," అన్నాడు ఖాలిద్ ఖలీఫాతో.

"అలా అయితే ఆ పనికి మరెవరినన్నా చూపు," అన్నాడు ఖలీఫా.

"కొత్త కొత్వాలు అహ్మద్ ఉండగా మరొక రెందుకు? ఆయన పదవిలోకి వచ్చి నాక ఇంతవరకూ ఎవరినీ పట్టుకున్నట్టు కని పించదు. ఈ మాయదారి ముసలిదాన్ని పట్టితే ఆయనే పట్టాలి. ఈ పని కూడా చెయ్య లేకపోతే ఇక ఆయన ప్రజ్ఞ ఏమున్నది?" అన్నాడు ఖాలిద్.

ఖలీఫా అహ్మద్‌ను పిలిపించి, అతనికి ముసలిదాని కథ అంతా చెప్పి, ఆమెను పట్టుకోమని ఆజ్ఞాపించాడు.

అహ్మద్ ఆ క్షణమే తన నలభై మంది భటులతోనూ ముసలిదాన్ని పట్టుకోవటానికి బయలుదేరాడు.

ఆ భటుల పైన జమేదారు గూని అలీ అనేవాడు. వాడు తన యజమాని అయిన అహ్మద్‌తో, "అయ్యా, నా ఉద్దేశం మనం ఈ ముసలిదాన్ని పట్టటంలో హసన్‌గారి సహాయం కూడా తీసుకుంటే బాగుంటుం దని!" అన్నాడు.

"ఓరి గూని వెధవా! మన కింకొకరు సహాయం చేసేదేమిట్రా? మనం అంత చాతకాని వాళ్ళమా? మరోసారి ఆ మాట అన్నావంటే మక్కెలు విరగబొడుస్తాను, జాగ్రత్త!" అని అహ్మద్ హసన్‌కు వినిపించే లాగా అన్నాడు:

ముసలిదాన్ని పట్టటానికి తనను కాదని ఖలీఫా అహ్మద్‌ను పురమాయించినందుకే కుళ్ళుతున్న హసన్, అహ్మద్ ప్రగల్భాలు విని మరింత కుళ్ళిపోయాడు. "నా సహాయం లేకుండా ఈ అహ్మద్‌గాడికి ముసలిది దొరికి నప్పటి మాట కద!" అనుకున్నాడు హసన్ తనలో.

అహ్మద్ తన నలభై మంది భటులనూ రాజభవనం వెలపల ఉన్న మైదానం మీదికి



తెచ్చి, "వీరాగ్రేసరులారా! మిమ్మల్ని నాలుగు దళాలుగా విభజిస్తాను. నాలుగు దళాలూ నగరంలోని నాలుగు పేటలూ చక్కగా గాలించండి. రేపు మధ్యాన్నానికల్లా అందరూ ముస్తఫా వీధిలో ఉన్న సరాయ్ వద్దకు చేరండి. అక్కడికి నేను వచ్చి మీ అనుభవాలు వింటాను," అన్నాడు.

నాలుగు దళాలూ నాలుగు వైపులా బయలుదేరాయి. అహ్మద్ కూడా స్వయంగా ఆచోకీ తీయటానికి బయలుదేరాడు.

తనను పట్టటానికి ఖలీఫా అహ్మద్‌ను నియోగించినట్టు విని దిలైలా ఏ మాత్రమూ లక్ష్యపెట్టలేదు. ఆమె తన కుమార్తెతో,

"నన్ను నిజంగా పట్టగలవాడు హసన్ ఒక్కడే. ఖలీఫా అతన్ని నియోగించక పోవటం మన అదృష్టం. ఇక అహ్మద్ అంటావా? అతన్ని నువ్వయినా మూడు చెరువుల నీళ్ళు తాగించవచ్చు," అన్నది.

"అయితే నేను వెళ్ళి వాళ్ళను ఏడిపించి రానా, అమ్మా?" అని జీనాబ్ అడిగింది.

"అలాగే వెళ్ళిరా, తల్లీ!" అన్నది దిలైలా సంతోషంగా.

జీనాబ్ చాలా అందంగా అలంకరించుకుని, అతి పల్చని సిల్కు మేలి ముసుగు వేసుకుని, ముస్తఫా వీధిలో హజ్ కరీమ్ అనేవాడు నడుపుతున్న సరాయ్‌కి వెళ్ళింది. ఆమె హజ్ కరీముకు రెండు సలాములు పారేసి, "కొందరు ఆప్తమిత్రులు వస్తున్నారు. వారు మరెవ్వరితోనూ సంబంధం లేకుండా కాలక్షేపం చేస్తారు. అందుచేత మీ పెద్ద సావడి ఒక రోజుకు అద్దెకు ఇప్పించండి. అయిదు దీనారాలిస్తాను," అన్నది.

హజ్ కరీమ్ ఆ పిల్ల అందం చూసి, "అద్దె అవసరం లేదు. వచ్చే అతిథులు నా సారా ఖర్చు చేస్తే చాలు," అన్నాడు.

"దానికేమీ చిన్నుండదు. నా మిత్రులంతా చిల్లి కడవలే అనుకోండి," అన్నది జీనాబ్ నవ్వుతూ.

ఆమె తమ ఇంటి నుంచి తివాసీలూ, బాలీసులూ, బల్లలూ, కంచాలూ, ఇతర సామాన్లూ మోయించి తెప్పించి, సరాయ్ లోని పెద్ద సావట్లో పరిపించింది; తిండీ, తాగుడూ సిద్ధం చేయించి, సరాయ్ ముఖ ద్వారం వద్ద కాపువేసి నిలబడింది.

కొంతసేపటికి గూని అలీ, మరి తొమ్మిది మంది భటులూ ఎకసక్కెలాడు కుంటూ అక్కడికి వచ్చారు.

జీనాబ్ గూని అలీని చూసి, "తమరేనా అహ్మద్?" అని అడిగింది.

"కాదు, కాదు. నన్ను గూని అలీ అంటారు," అని నవ్వుతూ అన్నాడు అలీ.

"అయితే, మీరంతా నా ఆతిథ్యం స్వీకరించండి," అంటూ జీనాబ్ వారిని సావట్లోకి తీసుకుపోయింది.

ఆ పది మంది సారా పీపాచుట్టూ మూగి, తాగుడు మొదలుపెట్టారు. అందులో జీనాబ్ అదివరకే భంగు బాగా కలిపి ఉంచటంచేత, కొద్ది క్షణాలలోనే అందరూ ఒళ్ళు తెలియకుండా పడిపోయారు.

జీనాబ్ ఒక్కొక్క భటుణ్ణి కాళ్ళుపట్టి దొడ్లోకి ఈడ్చుకుపోయి, కట్టెలు పేర్చినట్టు ఒకరి మీద ఒకర్ని పేర్చి, వారి మీద ఒక గుడ్డ కప్పి, హాలు శుభ్రం చేసి, మళ్ళీ తలవాకిట నిలబడింది.



కొద్దిసేపట్లో మరొక జట్టుకు చెందిన పది మంది భటులు వచ్చారు. వారిని కూడా జీనాబ్ ఆహ్వానించి తీసుకుపోయి, తాగించి స్పృహ లేకుండా చేసి, దొడ్లోకి ఈడ్చుకుపోయింది.

కాస్సేపటికి, అహ్మద్ గుర్రం మీద వచ్చి చేరాడు. అతను తలవాకిట ఉన్న జీనాబ్‌ను చూసి, "ఏం పిల్లా, నా భటు లెవరైనా వచ్చారా?" అని అడిగాడు.

"తమరు కొత్వాలు అహ్మద్‌గారు కాదు కద! అలా అయితే, మీ భటులకు ఈ వీధి చివర ఎవతో ముసలిది కనిపించిందిట, ఆమెను పట్టుకోవటానికి వెళ్ళినట్టు తమతో మనవి చెయ్యమన్నారు. వాళ్ళు దాన్ని పట్టుకొచ్చేలోపుగా తమరు లోపలికి దయ చేసి, నా ఆతిథ్యం స్వీకరించండి," అన్నది జీనాబ్ సలాం చేసి.

అహ్మద్ పరమానందంతో ఒప్పుకుని, తాగటం ప్రారంభించి, త్వరలోనే స్పృహ తప్పి పడిపోయాడు. జీనాబ్ అతని లోదుస్తులు తప్ప మిగిలిన బట్టలూ, అభరణాలూ కాజేసింది. ఆమె దొడ్లో ఉన్న నలభై మంది భటులనూ అలాగే దోచి, అహ్మద్ ఎక్కివచ్చిన గుర్రం మీద ఇంటికి వెళ్ళిపోయింది.

అహ్మద్, అతని భటులూ కూడా రెండు పగళ్ళూ, రెండు రాత్రులూ ఒళ్ళు తెలియకుండా నిద్రపోయి, మూడోనాటి ఉదయం మేలుకున్నారు. చాలాసేపు వారికి తామెక్కడ ఉన్నదీ తెలియలేదు. అయితే క్రమంగా వాళ్ళు తమకు జరిగిన మోసాన్ని కొంచెం కొంచెమే గ్రహించి, భరించరానంత సిగ్గుపడిపోయారు. లోదుస్తులు ధరించి వీధిలోకి వెళ్ళటం మరింత అవమానం. అయినా వెళ్ళక తప్పదు. పైన బనీనులూ, కింద చెడ్డీలూ ధరించి అహ్మద్, అతని భటులూ సాహసించి వీధిన పడ్డారు.

—(ఇంకా ఉంది)





# మాయదారి ముసలిది

## 4

కొత్వాలు అహ్మద్ కష్టాలు అంతటితో తీరలేదు. జీనాబ్ చేసిన మోసం కారణంగా అహ్మద్, తన నలభైమంది భటులతో బాటు తన దుస్తులను పోగొట్టుకుని, లోదుస్తులు ధరించి సిగ్గుతో తలవంచుకుని వీధినబడి వస్తూ, రెండో కొత్వాలైన హసన్ కంటనే పడ్డాడు.

హసన్ అహ్మద్‌కు పట్టిన దుస్థితికి లోలోపల సంతోషించి, పైకి మటుకు అమాయకంగా, "ఇదేమిటి, అహ్మద్? ఉదయం పూట, అందులోనూ ఈ చలిగాలిలో ఇటువంటి దుస్తులతో తిరగటం ఆరోగ్యానికి మంచిదా?" అని అడిగాడు.

"కష్టాలు అందరికీ వస్తాయి, హసన్. విధిని తప్పించుకోవటం మహామహా వాళ్ళకే సాధ్యం కాదు. నేను ఒక బాలిక చేత మోసపోయాను. నీకు దాని ఆచూకీ ఏమైనా తెలుసునా?" అన్నాడు అహ్మద్ దీనంగా.

"నాకు ఆ పిల్లా తెలుసు, దాని తల్లీ తెలుసు. వెళ్ళి పట్టుకోమంటావా ఏమిటి?" అన్నాడు హసన్.

"అది ఎలా సాధ్యమవుతుంది?" అని అహ్మద్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏముంది? ఖలీఫా వద్దకు పోయి, ముసలిదాన్ని పట్టటం నీ వల్ల కాదని చెప్పు. ఆ పనికి నన్ను నియోగించమని ఖలీఫాను వేడుకో," అని హసన్ సలహా ఇచ్చాడు.

అహ్మద్ తన ఇల్లు చేరుకుని, దుస్తులు ధరించి, ఖలీఫా వద్దకు పోయి, ముసలిదాన్ని పట్టటానికి సమర్థుడు హసనే అని మనవి చేసుకున్నాడు.

ఖలీఫా హసన్‌ను పిలిపించి, "నీకు ఈ ముసలిది తెలుసునా? దాన్ని పట్టుకునే

ఆర్. నాగభూషణం



పని అహ్మద్ తన వల్ల కాదంటున్నాడు. నీకు చెబితే చెయ్యగలవా?" అని అడిగాడు.

"ముసలిదాన్ని ఎరుగుదును. అది ఈ దొంగతనా లన్నిటినీ ధనలోభంతో చేసిందని నేను అనుకోవటం లేదు. ఆమె తన శక్తి సామర్థ్యాలను ఏలినవారికి చూపటానికే ఇదంతా చేస్తూ ఉండాలి. ఆమె తాను దొంగిలించిన వస్తువులన్నీ ఎవరివి వారికి ఇచ్చినమీదట తమ రామెను క్షమించాలి. అలా అభయం ఇచ్చేటట్టుంటే, నే నామెను తెచ్చి, మీ ఎదట హాజరు పెట్టగలను." అన్నాడు హసన్.

ముసలిది ఎవరి సొత్తు వారికి తిరిగి ఇచ్చే పక్షంలో ఆమెను శిక్షించనని ఖలీఫా అభయం ఇచ్చాడు.

హసన్ తిన్నగా దిలైలా ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. జీనాబ్ తలుపు తెరిచింది.

"మీ అమ్మను ఖలీఫా వద్దకు తీసుకు పోవటానికి వచ్చాను. ఆమెను ఖలీఫా పిలుస్తున్నాడు. ఆయన ఆమె కిచ్చిన అభయం ఇదుగో. మీ అమ్మ తస్కరించిన సామానులన్నీ గుర్రాల మీదికి ఎత్తించు," అన్నాడు హసన్. దిలైలా మేడ దిగి వచ్చింది.

ఆమె దొంగిలించిన సరుకంతా గుర్రాల మీద వేయించారు. ఖలీఫా దగ్గిరికి వెళ్ళేందుకు దిలైలా తన కున్న దుస్తులలో కెల్లా మంచివి ధరించింది.

"నువు తీసుకున్న సామానంతా వచ్చి నట్టేనా?" అని హసన్ దిలైలాను అడిగాడు.

"అహ్మదూ, అతని భటులూ వేసుకున్న దుస్తులు తప్ప అంతా ఇచ్చేశాను. నిజానికి, ఆ దొంగతనంతో నాకు ఎలాంటి సంబంధమూ లేదు," అన్నది దిలైలా హసన్‌తో.

హసన్ నవ్వి, "అవునులే, అంతే. అది మరొకరి పని," అన్నాడు. ఇద్దరూ దర్బారు చేరుకున్నారు.

దిలైలాను చూడగానే ఖలీఫాకు ఆగ్రహావేశం వచ్చింది. ఆమె చేసిన దురంతాలు తలుచుకుని ఆయన, ఆమె తల నరికెయ్యమని భటులకు ఉత్తరు విచ్చాడు.


హసన్ అయనకు ఆయన ఇచ్చిన అభయం గుర్తు చేయవలసివచ్చింది. అప్పుడాయన శాంతించి, "నీ పేరేమిటి?" అని ఆమెను అడిగాడు.

"నా పేరు దిలైలా. నేను పావురాల టపా నడిపిన అధికారి భార్యను," అన్నది దిలైలా.

"నువు చాలా ప్రయోజకురాలిలాగా ఉన్నావు. వీరందరినీ ఎందుకు మోసం చెయ్యవలసివచ్చింది?" అని ఖలీఫా అడిగాడు.

దిలైలా ఖలీఫా ముందు మోకరించి, "ఏలినవారు నన్ను మన్నించాలి. నేను ధనాశతో ఈ దొంగతనాలు చెయ్యలేదు. నా భర్త నడుపుతూ ఉండిన పావురాల టపాను నేను నడుపుతానంటే ఏలినవారు అనుమతించారు కారు. కాని దొంగతనాలు చెయ్యటంలో ఘటికులైన ఈ హసన్, అహ్మద్‌లకు పెద్ద పదవు లిచ్చారు. వారికున్నపాటి సామర్థ్యం నాకు కూడా ఉన్నదని రుజువుచేస్తే పావురాల టపా నడిపే ఉద్యోగం నా కిప్పిస్తారేమోనన్న ఆశతో





ఇలా చేశాను," అన్నది. ఆమె మాటలు ఖలీఫాకు నమ్మదగినవిగానే తోచాయి.

ఆయన ఫిర్యాది లందరికీ వారి వారి సొత్తు ఇప్పించి, దిలైలా కేసి తిరిగి, "ఇంతకూ నువు కోరేదేమిటి ?" అన్నాడు.

"నా భర్త చేసిన ఉద్యోగమూ, జీతమూ నాకు దయచేయించండి. పావురాల టపా నడిపే విధానమంతా నాకు పూర్తిగా తెలుసు. టపా పావురాలను పోషించినది నేనూ, నా కూతురూనూ. మేమే వాటికి ఉత్తరాలు కట్టేవాళ్ళం. పావురాల టపా నిమిత్తం ఏలినవారు పెద్ద దివాణం ఏర్పాటు చేసి, దాని రక్షకులుగాను నలభై మంది నీగ్రో బానిసలనూ, నలభై వేట కుక్కలనూ ఇచ్చారు. ఆ దివాణాన్ని నిర్వహించినది నా భర్త కాదు, నేను! అందుచేత ఆ పని నిర్వహించటం నాకు ఎంత మాత్రమూ అసాధ్యం కాదు." అని దిలైలా ఖలీఫాకు విన్నవించుకున్నది.

ఆమె కోరిక సక్రమమేనని ఖలీఫాకు తోచింది. దిలైలాను పావురాల టపా నిర్వాహకురాలుగా నియమిస్తూ ఆయన ఆజ్ఞాపత్రం తయారుచేయించాడు.

ఆ రోజే దిలైలా తన మకామును పావురాల టపా దివాణానికి మార్చి, తన ఇంటి సామాను యావత్తూ ఆ దివాణానికి తరలించింది. నలభై మంది నీగ్రో బానిసలూ దివాణానికి తిరిగివచ్చారు. నలభై వేట కుక్కలు కూడా వచ్చాయి. నీగ్రోలకు దిలైలా ఎర్రని జరీ దుస్తులు ఏర్పాటు చేయించింది. దివాణంలో నలభైచక్క మేకు కొట్టించి, ఆ మేకులకు అహ్మద్ దుస్తులూ, నలభైమంది భటుల దుస్తులూ, తన కుమార్తె సాధించిన విజయానికి చిహ్నలుగా తగిలించింది.

ఆమె రోజా మగదుస్తులు వేసుకుని, నెత్తిమీద వెండి పావురం గల బంగారు టోపీ ధరించి, రాజభవనానికి వెళ్ళి టపా చెయ్యి


పలసిన సందేశాలు తెస్తూ ఉండేది. తల్లి కూతుళ్ళకు రోజులు సుఖంగా వెళ్ళి పోతున్నాయి.

పై సంఘటనలు జరిగిన కొద్ది రోజులకు ఒక యువకుడు కైరోనగరం నుంచి బాగ్దాదు నగరానికి వచ్చాడు. వాడి అసలు పేరు అలీ. కాని వాడికి "పాదరసం" అనే సార్థకనామం ఉండేది. వాడు చాలా అందమైన యువకుడు. కాని గజదొంగ.

ప్రస్తుతం బాగ్దాదులో కొత్వాలు పదవిలో ఉన్న అహ్మద్ కైరోలో గజదొంగగా జీవి స్తున్నప్పుడు "పాదరసం" అహ్మద్ వద్దనే దొంగతనంలో శిక్షణ పొందాడు. అహ్మద్ కైరో వదిలి బాగ్దాదు చేరి, అక్కడ కూడా గజదొంగగా ఖ్యాతి సంపాదించుకుంటున్న కాలంలో ఈ అలీ కైరోలో దొంగల పెద్దగా పరిణమించాడు. అతను ఎన్నిసార్లు పట్టు బడి కూడా అవలీలగా తప్పించుకుపోవటం చేత అతనికి "పాదరసం" అన్న పేరు వచ్చింది.

"పాదరసం" అలీని బాగ్దాదుకు పిలి పించినవాడు కొత్వాలు అహ్మదే. దలైలాను పట్టుకునే ప్రయత్నంలో జినాబ్ చేతిలో దుర్భరమైన అవమానానికి గురి అయిన నాటి నుంచీ అహ్మద్‌కు ప్రతి క్షణమూ "పాదరసం" గుర్తుకు రాసాగాడు. కైరోలో





వాడు తనకు కుడి భుజం లాగుండేవాడు. వాడే తన పక్కన ఉంటే తనకా పరాభవం జరగకపోను. దిలైలా మీద తాను స్వయంగా పగ తీర్చుకునే అవకాశం ఇప్పుడు లేదు. ఇప్పు డామె హోదా తన హోదాకు ఏమీ తక్కువ కాదు. అందుచేత అహ్మద్ ''పాదరసం'' ద్వారా పగ తీర్చుకోదలచి, అతన్ని బాగ్దాదు నగరానికి పిలిపించాడు.

''పాదరసం'' బాగ్దాదు నగరం చేరుతూనే అహ్మద్ ఇంటికి వచ్చాడు. అతన్ని చూడగానే అహ్మద్‌కు ప్రాణం లేచివచ్చి నట్టయింది.

''తమ్ముడూ, నువ్వు నా యింట కొన్నాళ్ళు రహస్యంగా ఉండాలి. నీతో ఒక రాచకార్యం ఉన్నది. అది పూర్తి అయాక నిన్ను నేను స్వయంగా ఖలీఫా వద్దకు తీసుకుపోయి, శిఫార్సు చేసి, మంచి ఉద్యోగం ఇప్పిస్తాను,'' అన్నాడు అహ్మద్ పాదరసంతో.

అహ్మద్ ఇంట రెండు రోజులు రహస్యంగా గడిపిన మీదట ''పాదరసం'' బయటికి పోవాలని తహతహలాడాడు. అతనికి ఖైదులో ఉన్నట్టు, అనిపించింది. అందుచేత, మూడోనాడు అహ్మద్ రాజభవనానికి బయలుదేరి పోగానే, ''పాదరసం'', బాగ్దాద్ నగరం అంతా చుట్టబెట్టి వద్దామనే ఉద్దేశంతో ఇంటి నుంచి చల్లగా బయటికి వచ్చాడు.

''పాదరసం'' వీధి వెంట కొద్దిదూరం వెళ్ళాడో లేదో, అతని కొక విచిత్ర దృశ్యం కంటపడింది. ఒక ముసలిది మగదుస్తులు ధరించి, నెత్తిన వెండి పావురం గల బంగారు టోపీ ధరించి, గుర్రం మీద వీధి వెంట పోతున్నది. ఆమె వెంట ఎర్ర జలతారు దుస్తులు ధరించిన నీగ్రోలు పోతున్నారు. ఆ ముసలిది దిలైలా. నీగ్రోలు ఆమె నౌకర్లు. ఆ ఉదయం దిలైలా రాజ

భవనానికి వెళ్ళి, పావురాల ద్వారా పంపవలసిన టపా అంతా పోగుచేసుకుని, తన ఇంటికి తిరిగి వెళ్ళిపోతున్నది.

దిల్లైలా "పాదరసం" అలిసి చూసింది. చూసి, అతని అందానికి ఆశ్చర్యపడింది. కాని అతని కళ్ళలో ఆమెకు అహ్మద్ లక్షణాలు కొన్ని కనిపించాయి. దానికి కారణం ఉన్నది: అహ్మద్ శిష్యత్వం చెయ్యటంలో "పాదరసం" తనకు తెలియకుండానే అహ్మద్ లాగా చూడటమూ, ముఖాలు పెట్టటమూ నేర్చుకున్నాడు. అంతేగాక, "పాదరసం" అహ్మద్ ఇంటిదిక్కునుంచి రావటంకూడా దిల్లైలా గమనించింది.

ఆమె ఇల్లు చేరుకుని తన కుమార్తెకు తాను చూసిన యువకుణ్ణి వర్ణించి చెప్పి, "కొత్వాలు అహ్మద్ వీణ్ణి ఎక్కడి నుంచో పిలిపించాడని నా అనుమానం. వాడు నగరాన్ని వింతగా చూస్తున్నాడు. ఇక్కడి వాడు కాడు. కొత్తగా దిగాడు. ఏమైనా మనం మన జాగ్రత్తలో ఉండటం మంచిది," అన్నది.

"ఎంతెంత వాళ్ళని లక్ష్యపెట్టనిదానివి, మీసాలూ, గడ్డమూ సరిగా రాని ఈ కుర్రాణ్ణి గురించి అంత బెదురుగా మాట్లాడతావేం? ఇతగాడి సంగతి నేను చూస్తానుండు." అన్నది జీనాబ్.





ఆమె అందమైన దుస్తులు ధరించి, కళ్ళకు కాటుక పెట్టుకుని, మేలిముసుగు వేసుకుని, చేత సంచి పట్టుకుని, మెరుపు కదులుతున్నదనిపించేటట్టు వీధిలోకి నడిచింది. ఆమె వీధి వెంట కొంతదూరం వెళ్ళాక ఒక దుకాణం దగ్గిర "పాదరసం" కనిపించాడు. తల్లి చేసిన వర్ణననుబట్టి జీనాబ్ అతన్ని గుర్తు పట్టింది. ఆమె అతన్ని రాచుకుంటూ ముందుకువెళ్ళి, వెనక్కు తిరిగి, "కబోదిపక్షి!" అన్నది కోపంగా.

"పాదరసం" ఆమె కేసి చూసి, ఆమె అందానికి నిర్ఘాంతపోయాడు. అతను నవ్వుతూ, "ఏం చక్కదనం! ఎవరిదానివి?" అని అడిగాడు.

"ఒక వర్తకుడి కూతుర్ని. ఇంకో వర్తకుడి భార్యను. మీ ధోరణి చూడగా ఊరికి కొత్తలాగుంది. మీ బస ఎక్కడ?" అని అడిగింది జీనాబ్.

అహ్మద్ ఇంట తానుంటున్నది రహస్యంగా గనక, పాదరసం, "ఇంకా బస చూసుకోలేదు. చూడాలి." అన్నాడు.

"అయితే మా ఇంటికి రండి. మాది చాలా పెద్ద లోగిలి. నా భర్త దుకాణానికి వెళితే నేను ఒంటరిగా ఉంటాను." అన్నది జీనాబ్.

ఆమె ఆహ్వానాన్ని అందుకోవటం మంచిది కాదేమోనని "పాదరసం" శంకించాడు. కాని తనకు ఈ నగరంలో ఎవరూ తెలీదు. యాదృచ్ఛికంగా వీధిలో కనిపించిన ఆడమనిషి తనకు శత్రువై ఉండే అవకాశం లేదు. అందుచేత ఆమె వెంట వెళ్ళి, ఆమె తత్వం ఏమిటో తెలుసుకుందామని అతను అనుకున్నాడు.

జీనాబ్ అతన్ని చాలా వీధులు తిప్పి, ఒక పెద్ద భవనం ముందు ఆగి, తాళపు చెవి కోసం తన సంచీలో వెతకనారంభించింది. అది ఒక గొప్ప వర్తకుడి ఇల్లు.

ప్రస్తుతం ఆ ఇంట్లో ఎవరూ లేరు. వర్తకుడు ఉదయం ఇంటికి తాళం వేసి దుకాణానికి పోతాడు. రాత్రిదాకా తిరిగి రాడు. ఆ మాట జీనాబ్‌కు తెలుసు.

"అయ్యో, తాళంచెవి కాస్తా పారేసుకున్నాను. ఏం చెయ్యాలి? తాళం మీరేమైనా తియ్యగలరా?" అన్నది జీనాబ్.

అంత పెద్ద తాళాన్ని "పాదరసం" క్షణంలో తీశాడు. అతని హస్తలాఘవాన్ని బట్టి అతను గజదొంగనని జీనాబ్ రూఢి చేసుకున్నది.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

"మీ రీ హాలులో కూర్చోండి. నేను బావి నుంచి నీరు తెచ్చి వంట చేస్తాను." అంటూ జీనాబ్ బిందె తీసుకుని దొడ్లోకి వెళ్ళింది.

కొంచెం సేపయాక దొడ్లో నుంచి జీనాబ్ కెవ్వున కేకపెట్టటం విని, ఏం జరిగిందో అని "పాదరసం" దొడ్లోకి వెళ్ళేసరికి, జీనాబ్ బావిలో నుంచి చేద పైకి లాగక, బావిలోకి తొంగి చూస్తూ కనిపించింది.


"ఏమయింది?" అని "పాదరసం" అడిగాడు.

"నా రవ్వల ఉంగరం! అయిదు వందల దీనారాలకు నా భర్త నిన్ననే కొని పెట్టాడు. అది కాస్తా బావిలో పడిపోయింది. నా భర్తకు తెలిస్తే చంపేస్తాడు!" అని జీనాబ్ లబలబలాడింది.

"ఇంతే గద! నేను దిగి తీస్తానుండు," అన్నాడు "పాదరసం".

అతను బావి మీద ఉన్న అడ్డదూలానికి మోకు కట్టి బావిలోకి దిగాడు. అతను ఉంగరం కోసం వెతకటానికి మోకు వదిలి నీటిలో మునగగానే జీనాబ్ మోకు పైకి లాగేసి, "నిన్ను అహ్మద్ పైకి తీసే దాకా అందులోనే ఉండు!" అంటూ, అతని దుస్తులు తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది.

—(ఇంకావుంది)





# మాయదారి ముసలిది

## 5

ఆ రాత్రి చీకటిపడి ఆ ఇంటి యజమాని తన నౌకరుతో సహా తిరిగి వచ్చాడు. తల వాకిలికి తాళం లేదు. కంగారుపడి ఆయన ఇల్లంతా చూసుకుని, దొంగతనం ఏమీ జరగలేదని తెలుసుకున్నాడు.

తన యజమాని స్నానం కోసం నౌకరు బావి వద్దకు వెళ్ళి, చేద వేసి పైకి తోడబోయాడు. కాని చేదను ఎవరో గట్టిగా పట్టుకున్నట్టు అయింది.

"అమ్మో, వట్టిపోయింది!" అని కేక పెట్టి నౌకరు ఇంట్లోకి పరిగెత్తాడు.

వర్తకుడు దీపం పట్టుకుని దొడ్లోకి వచ్చి, చేదతాడు పట్టుకుని బావిలో నుంచి పైకి వస్తున్న "పాదరసం" అలీని చూశాడు.

వర్తకుడు ఆగ్రహంతో, "బద్మాష్! ఎవరు నువ్వు? ఇప్పుడే నిన్ను భటులకు పట్టి ఇస్తాను!" అని కేకలు పెట్టాడు.

"పాదరసం" అమాయకంగా మొహం పెట్టి, ఎంతో మర్యాదగా, "అయ్యా, ఇది ఏ దేశం? ఏ గ్రామం? నేను ఈజిప్టుదేశం వాణ్ణి. నేను మా నైల్ నదిలో స్నానం చేస్తూ, ఒక సుడిగుండంలో చిక్కుకుని అడుగుకు దిగిపోయి, చాలా సేపటికి తేలాను. నేను తేలినది మీ బావిలో!" అన్నాడు.

ఈ అబద్ధాన్ని వర్తకుడు నమ్మేశాడు.

"ఎంత ఆశ్చర్యం! ఇది బాగ్దాదు నగరం. ఎక్కడ మునిగి ఎక్కడ తేలావు! నీకు పొడిబట్ట లిస్తాను. ఈ రాత్రికి ఇక్కడే భోజనం చేసి పడుకో. రేపు మీ దేశానికి బయలుదేరి పోదువుగాని." అన్నాడు ఆయన జాలిగా.

మర్నాడు ఉదయం "పాదరసం" తిరిగి ఇంటికి చేరేదాకా అహ్మద్ ప్రాణాలు ప్రాణాలలో లేవు. తన ప్రయోగమంతా ఫలించిన

అర్. నాగభూషణం



అందోళనతో అహ్మద్ క్రితం రాత్రి తిండి తినలేదు. కన్ను మూయలేదు. తెల్లవారుతూనే అతను తన సాటి కొత్వాలయిన హసన్‌ను పిలిపించి సలహా అడిగాడు.

వారిద్దరూ మాట్లాడుతూ ఉండగానే "పాదరసం" తిరిగి వచ్చాడు.

అతను తన అనుభవమంతా కొత్వాళ్ళు ఇద్దరికీ వివరంగా చెప్పాడు.

అంతా విని హసన్ చిరునవ్వు నవ్వి, "బాగ్దాదులో ఒక చిన్నది ఇంత పని చేసిందంటే అది దిలైలా కూతురు జీనాబ్ తప్ప మరొకతె కాదు. అది నీకు చిక్కితే ఏం చెయ్యదలిచావు?" అని అలీని అడిగాడు.

"పెళ్ళాడదామనుకుంటున్నాను!" అన్నాడు "పాదరసం" తడుముకోకుండా.

"అది నీకు ఇంత చేశాక కూడానా?" అన్నాడు హసన్ ఆశ్చర్యంతో.

"ఇంతకు రెట్టింపు చేసినా దానిమీద నాకు ఆగ్రహం లేదు. దాన్ని నా భార్యగా చేసుకోవాలన్న కోరిక తప్పించి జీవితంలో నాకు మరే కోరికా లేదు," అన్నాడు "పాదరసం."

"అంత బలమైన కోరిక తీరవలసిందే. నువ్వూ దానిలాగే అందగాడివి. మీ ఇద్దరికీ జోడు సరిపోతుంది," అన్నాడు హసన్.

"మనవాడికి నువు కాస్త సహాయం చెయ్యి, హసన్," అన్నాడు అహ్మద్.

హసన్ కొంచెం ఆలోచించి, "పాదరసం" అనుసరించదగిన మార్గం తెలిపాడు.

"పాదరసం" తన ఒళ్ళంతా నల్ల రంగు పూసుకుని నీగ్రోలాగా తయారై, నీగ్రో దుస్తులు ధరించి, కొంత డబ్బూ, ఇంత భంగూ తీసుకుని, కూరలబజారుకు వెళ్ళాడు. అక్కడ అతనికి దిలైలా వంటవాడు కూరలు కొంటూ కనిపించాడు. "పాదరసం" వాణ్ణి పట్టుకుని, "అన్నా, నేనీ నగరానికి కొత్తగా వచ్చాను. సాటి నీగ్రోవు కనిపించావు. సారా దుకాణానికి పోదాం పద. స్నేహపూర్వకంగా తాగుదాం," అన్నాడు.

"సారా దుకాణంలో కూర్చుని తాగటానికి నాకు తీరిక ఎక్కడుంది? మనవే మా యింటికి రాగూడదూ? నీకు ఏ రకం తాగుడు కావాలన్నా అక్కడ ఉన్నది. ఆపైన నీకు భోజనం కూడా పెడతాను," అన్నాడు దిలైలా వంటవాడు.

"పాదరసం" కోరినదీ అదే. అతను వంటవాడి వెంట దిలైలా ఇంటికి చేరి, వంట ఇంట ప్రవేశించాడు.

త్వరలోనే దిలైలా, జీనాబ్ భోజనానికి వచ్చారు. వంటవాడు వారికి ఆహారమూ, తాగుడూ సిద్ధం చేసి, ఒక్కొక్కటే తీసుకుపోయి వారికి అందించసాగాడు. వాడు వంటగది నుంచి అవతలికి వెళ్ళిన సమయంలో "పాదరసం" వాళ్ళ తాగుడు లోటాలలో భంగు కలిపేశాడు.

కొంతసేపటికి భంగు తన ప్రభావం చూపింది. దిలైలా, జీనాబ్, నలభైమంది నీగ్రో బానిసలూ, వంటవాడూ, ఎక్కడి వాళ్ళక్కడ ఒళ్ళు తెలియకుండా పడిపోయారు. ఆఖరుకు వేటకుక్కలు కూడా భంగుకు గురిఅయాయి.

ఇప్పుడు [illegible]రసం" యథేచ్ఛగా ఇల్లంతా గాలించి, దిలైలా ధరించే అధికార దుస్తులూ, వెండి పావురంగల బంగారు టోపి, నీగ్రోలు వేసుకునే ఎర్ర జరి





దుస్తులూ పోగుచేసి మూట కట్టుకున్నాడు. తరవాత అతను మిద్దె మీదికి వెళ్ళి, గూళ్లలో నుంచి పావురా లన్నిటినీ బయటికి తీసి, పెద్ద పంజరంలో పెట్టుకున్నాడు. తరవాత ఒక చీటీ మీద, "ఈ పని చేసినవాడు వీరాగ్రేసరుడైన 'పాదరసం' అలీ తప్ప మరెవరూ కాదు!" అని రాసి పెట్టి, మూటనూ, పంజరాన్నీ తీసుకుని అహ్మద్ ఇంటికి వెళ్ళిపోయాడు.

చీకటి పడుతూండగా దిలైలాకు స్పృహ వచ్చింది. ఆమె లేచి "పాదరసం" పెట్టి పోయిన చీటీ చూసుకుని, పోయిన వస్తువు లేవో తెలుసుకున్నది. అవన్నీ ఖలీఫా సొత్తే!

దిలైలాకు పెద్ద సమస్య వచ్చి పడింది. ఈ దొంగతనం వివరాలు బయటపడితే ఆమె ఉద్యోగంతోబాటు పరువూ పోతుంది. ఆ తరవాత "పాదరసం" మీద పగ తీర్చు కున్నప్పటికీ ప్రయోజనం ఉండదు. "పాద రసం" చేత ఈ పని చేయించినవాడు అహ్మదే అయిఉంటాడు. అహ్మద్ మీద పగ తీర్చుకోవటానికని తాను తన కూతురి ద్వారా "పాదరసం" అలీకి పరాభవం చేయిస్తే, అహ్మద్ ఆ "పాదరసం" ద్వారానే తన మీద పగ సాధించాడు. రెంటికీ సరి పోయింది. తాను వెళ్ళి అహ్మద్ కాళ్ళు పట్టుకుని, పోయిన సొత్తు తిరిగి తెచ్చు కోవటం తప్ప దిలైలాకు గత్యంతరం లేదు. పగ సాధించుకున్నాడు గనక అహ్మద్ తనతో రాజీకి రావచ్చు.

"ఇప్పుడే వస్తా," అని కూతురికి చెప్పి దిలైలా అహ్మద్ ఇంటికి వెళ్ళింది.

దిలైలా అహ్మద్ ఇంటికిచేరేసరికి అహ్మద్, హసన్, "పాదరసం" భోజనాలకు కూర్చుని ఉన్నారు. ఆమెను చూడగానే అహ్మద్, హసన్‌లు లేచి నిలబడి, తలలు వంచి సలా ములు చేసి, "దయ చెయ్యండి, దిలైలా! మాతోబాటు భోజనం చెయ్యండి!" అని గౌరవంగా అహ్వానించారు.



వారి ముందున్నది పావురాల మాంసమని తెలియగానే దిలైలాకు కళ్ళు చీకట్లు కమ్మాయి. తల తిరిగిపోయింది.

ఆమె వణుకుతున్న కంఠంతో, "అహ్మద్‌కు నా మీద ఎంత కసి ఉంటే మటుకు, ఖలీఫా ప్రాణప్రదంగా చూసుకునే టపా పావురాలను దొంగతనంగా తెప్పించుకుని, వండించుకు తినటం భావ్యమా? దొంగతనంలో మాత్రం నియమం ఉండవద్దా?" అన్నది.

హసన్ దిలైలాను అనునయిస్తూ, "కంగారు పడకమ్మా! టపా పావురాలకు ఏ ఆపదా రాలేదు. ఖలీఫా సొత్తంతా సురక్షితంగానే ఉన్నది. ఈ చిన్నవాడికి ఒకే ఒక కోరిక ఉన్నది. దానికి నువు అంగీకరించినట్టయితే నీ పావురాలూ, దుస్తులూ ఈ క్షణాన నీకు తిరిగి వస్తాయి. అందుకు నేను హామీపడతాను," అన్నాడు.

"ఆ కోరిక ఏమిటో చెప్పండి. నేను కాదనే స్థితిలో లేనని మీకు తెలుసుగదా!" అన్నది దిలైలా.

"మరేమీ లేదు. ఈ కుర్రవాడు, అలీ నీ కుమార్తెను, జీనాబ్‌ను పెళ్ళాడగోరుతున్నాడు. దానికి నువు అంగీకరించాలి," అన్నాడు హసన్.

"అయ్యో, నాయనా! నన్నింత శ్రమ పెట్టినది ఇందుకా? నా అంగీకారంవల్ల చిన్నమెత్తు లాభం లేదు. మా జీనాబ్‌కు వయసు వచ్చేదాకా దానికి రక్షకుడు దాని మేనమామ—నా పెద్దన్న జురేక్. ఆయన సరేననందే ఈ పెళ్ళి జరగదు. మీకు తెలియనిదేముంది? జురేక్ శతమొండి. ఎద్దేమంటే తెడ్డేమనే రకం. ఆయనని ఈ పెళ్ళికి ఒప్పించేభారం 'పాదరసం' అలీ తనమీద వేసుకోవాలి. అది తప్ప మరోమార్గం లేదు," అన్నది దిలైలా.

"అలా అయితే, నేను జురేక్‌ను కలుసుకుని, ఆయనచేత సరేననిపించి, ఆ తర



వాతనే జీనాబ్‌ను పెళ్ళాడతాను," అన్నాడు "పాదరసం."

దిలైలా తన దుస్తులూ, పావురాలూ తీసుకుని వెళ్ళిపోయింది.

దిలైలా అన్న జురేక్ ఒకప్పుడు ఆరితేరిన దొంగ. ఆ కాలంలో అతను చేసిన దొంగతనాలకు దర్యాప్తూ, విచారణా ఉండేవి కావు. అతను కూర్చున్న చోటునుంచి కదలకుండా ఎప్పుడు, ఎక్కడ ఏ దొంగతనం చెయ్యాలన్నా చేసేవాడు. ఇప్పుడు ముసలితనం వచ్చేసింది; దొంగతనాలు మానేసి, చేపలు వేయించి అమ్ముకుని కాలక్షేపం చేస్తున్నాడు.

తన దుకాణానికి కొనుగోలు దార్లను ఆకర్షించటానికి జురేక్ ఒక యుక్తి పన్నాడు. అతను తన దుకాణం వాకిలికి ఒక వెయ్యి దీనారాల సంచీ వేళ్ళాడగట్టి, దాన్ని ఎవరు ఎత్తుకు పోగలిగితే వాళ్ళు ఉంచుకోవచ్చునని ప్రకటన చేశాడు.

ఎలాగైనా ఆ సంచీ కాజేతామని వేల సంఖ్యలో జనం వచ్చి వేయించిన చేపలు కొన్నారు. కాని ఒక్కరైనా ఆ సంచిని కాజెయ్యలేకపోయారు. ఎందుచేతనంటే, ఎవరైనా ఆ సంచిని తాకితే చాలు, దుకాణం అంతటా గంటలూ, డప్పులూ మోగేవి. అవి మోగగానే జురేక్, దొడ్లో ఉన్నాసరే, పరిగెత్తుకుంటూ వచ్చి దొంగను పట్టేసేవాడు. లేకపోతే, దొంగతనం చెయ్యదలిచినవాళ్ళను దూరం నుంచే సీసపుగుళ్ళు విసిరి కొట్టేవాడు. అలా కాళ్ళూ, చేతులూ విరుచుకున్నవాళ్ళూ, గాయపడినవాళ్ళూ బాగ్దాదులో చాలామంది ఉన్నారు.

"పాదరసం" జురేక్ వద్దకు వెళ్ళి, తన ఊరూ, పేరూ చెప్పుకుని, "నేను కొత్వాల్ అహ్మద్ గారింట పని చేస్తున్నాను. నాకు మీ మేనగోడలయిన జీనాబ్‌ను పెళ్ళాడాలని ఉన్నది. అందుకు మీ అనుమతి కోరటానికి వచ్చాను," అన్నాడు.

జురేక్ తల అడ్డంగా తిప్పి, "నువ్వు జీనాబ్‌ను పెళ్ళాడటానికి నేను ఏమాత్రమూ ఒప్పుకోను. నువ్వు జీనాబ్‌కు ఎంతమాత్రమూ తగవు," అన్నాడు.

జురేక్ తన దుకాణంలో వేళ్ళాడ గట్టిన దీనారాల సంచీ కాజేస్తే ముసలాడు పెళ్ళికి ఒప్పుకుంటాడని తలచి, "పాదరసం" ఆ సంచీని కాజెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

అందుకని అతను నిండు చూలాలి వేషం ధరించి, మర్నాడు జురేక్ దుకాణానికి వచ్చి, చేపలు బేరం చేస్తూ, నొప్పులు వచ్చినట్టు అభినయించాడు. అది చూసి జురేక్, తన భార్యను కేక వెయ్యటానికి కంగారుగా లోపలికి వెళ్ళాడు.

జురేక్ లోపలికి పోగానే "పాదరసం" చప్పున దీనారాల సంచీని పట్టుకున్నాడు. అతని చెయ్యి సంచీకి తగులుతూనే దుకాణమంతటా గంటలూ, డప్పులూ మోగాయి.

వెంటనే జురేక్ దుకాణంలోకి వచ్చి, సంచీని వదిలి పారిపోతున్న "పాదరసం" మీదికి సీసంగుండు విసిరాడు.

ఆ గుండుదెబ్బకు "పాదరసం" వీధిలో కుప్ప కూలిపోయాడు. అతను వెంటనే లేచి, కుంటుకుంటూ అహ్మద్ ఇల్లు చేరుకున్నాడు.



ఈ సంఘటన కళ్ళారా చూసినవాళ్ళు జారేక్‌ను రకరకాలుగా తిట్టుతూ, "నువ్వు మనిషివా, పశువువా? పాపిష్టి డబ్బుతో అందరికీ ఆశ పెట్టటంగాక, నిండు చూలాలిని సీసంగుండుతో కొడతావా?" అన్నారు.

"ఇటువంటి నీతులు చాలా విన్నాం!" అన్నాడు జారేక్ నిర్లక్ష్యంగా.

దెబ్బ తిని కూడా "పాదరసం" తన పట్టు వదలలేదు. దెబ్బ నయం కాగానే అతను జారేక్ దుకాణానికి మళ్ళీ బయలుదేరాడు. జారేక్ చేతిలో చావుకైనా సిద్ధపడ్డాడు గాని, అతను జీనాబ్‌ను పెళ్ళాడే ప్రయత్నం మానదలచ లేదు.

ఈ సారి "పాదరసం" ఒక నౌకరు వేషం ధరించి, ఒక సంచీ చేత పట్టుకుని, జారేక్ దుకాణానికి వెళ్ళి, "వేయించిన చేపలు వేడివేడిగా ఇప్పించండి," అని అడిగాడు.

"వేడివేడి చేపలు కావాలంటే నిప్పు చేసేదాకా ఆగు," అని జారేక్ అవతలికి వెళ్ళాడు. వెంటనే "పాదరసం" దీనారాల సంచీ పట్టుకున్నాడు. దుకాణం అంతటా గంటలూ, డప్పులూ గందరగోళంగా మోగాయి.

జారేక్ ఒక్క దూకున దుకాణంలోకి వచ్చి పడి, "నీ దొంగ వేషం నేను కనిపెట్టలేదనుకున్నావురా?" అని, ఒక సీసం గుండు తీసి, "పాదరసం" తలకు గురిపెట్టి, బలంగా విసిరాడు.

"పాదరసం" చప్పున వంగాడు. జారేక్ విసిరిన సీసంగుండు వీధిలోకి పోయి, వీధి వెంట నడిచే ఒక మనిషి నెత్తిన ఉన్న పెరుగు ముంతకు తగిలింది. ముంత పగిలి, అందులోని పెరుగు చింది, ఒక కాదీ ముఖం మీదా, గడ్డం మీదా పడింది.

ఇది చూస్తున్నవాళ్ళు జారేక్‌తో, "కాది గారు నీ పాపిష్టి డబ్బుకు వడ్డీ కట్టి నీకు వడ్డిస్తారులే ఉండు!" అన్నారు.

—(ఇంకా వుంది)





# మాయదారి ముసలిది

## 6

జూరేక్ చేపలదుకాణంలో ఉన్న దీనారాల మూట కాజెయ్యటానికి "పాదరసం" చేసిన రెండు ప్రయత్నాలూ వృధా అయాయి. అయినా అతను తన ప్రయత్నం మానక, పాములవాడి వేషం వేసుకుని, బుట్టలో మూడు తాచులను పెట్టుకుని వచ్చి, వాటిని జూరేక్ దుకాణం ముందు ఆడించసాగాడు.

"పాదరసం" పాములను ఆడిస్తూనే, ఒక పామును జూరేక్ పాదాల ముందు పడేటట్టు దుకాణంలోకి విసిరివేశాడు. జూరేక్ బెదిరి లోపలికి పారిపోయాడు.

ఆ గలభాలో "పాదరసం" దీనారాల సంచిని పట్టుకున్నాడు. అయితే అంతలోనే జూరేక్ సీసంగుండ్లు తెచ్చి, ఒక దానితో పాము తల చితకగొట్టి, రెండో దాన్ని "పాదరసం" కేసి బలంగా విసిరాడు. "పాదరసం" తప్పుకున్నాడు. గుండు వీధిలోకి వెళ్ళి, వీధినపోయే ఒక ముసలిదానికి తగిలింది. ముసలిది అక్కడే ప్రాణాలు విడిచింది.

అక్కడ చేరిన జనం జూరేక్‌ను చంపటానికి వచ్చారు. జూరేక్ భయపడి, తన దుకాణం వాకిలి నుంచి దీనారాల సంచీ తీసెయ్యటానికి ఒప్పుకుని, దాన్ని తీసుకుపోయి తన వంటింట పూడ్చిపెట్టాడు.

సంచితో పని అయిపోయింది గనక అందులో ఉన్న డబ్బు తమ కొడుకు పుట్టిన రోజు పండగకు ఖర్చు చేద్దామన్నది జూరేక్ భార్య. అందుకు జూరేక్ ఒప్పుకోలేదు.

ఆ రాత్రి జూరేక్‌కు ఒక కల వచ్చింది. కలలో ఏదో పక్షి, వంటింట్లో ముక్కుతో తవ్వి, దీనారాల సంచిని పైకి లాగుతున్నది.

"ఏదో పక్షి వంటింట్లో ముక్కుతో తవ్వుతున్నది, చూడవే!" అన్నాడు జూరేక్ తన భార్యతో.

ఆర్. నాగభూషణం



జురేక్ భార్య దీపం తీసుకుని వంటింట్లోకి వెళ్ళి, కిటికీలో నుంచి ఎవరో బయటికి దూకి పారిపోతూండటం చూసింది. ఆ పారిపోయే మనిషి చేతిలో దీనారాల సంచీ ఉన్నది.

ఆ దొంగ "పాదరసం" అలీయే. జురేక్ దుకాణం నుంచి సంచీని దించినాక, "పాదరసం" అక్కడే తచ్చాడి, దాన్ని జురేక్ వంట ఇంట పాతెయ్యటం గమనించి, ఆ రాత్రి వచ్చి దాన్ని కాస్త తవ్వి తీసుకుపోయాడు.

"నీ నోరుబడ! డబ్బు పిల్లవాడి పుట్టిన రోజుకు ఖర్చు చేద్దామంటే పల్లకాదన్నావు. ఇప్పుడు దాన్ని దొంగ దోచుకుపోయాడు."

అని భర్తను తిట్టుతూ జురేక్ భార్య శోకాలు పెట్టింది.

"ఆ డబ్బు పోదులే. ఇప్పుడు తీసుకు రానూ?" అంటూ జురేక్ ఇంటి నుంచి బయలుదేరాడు.

"డబ్బు లేకుండా తిరిగి వచ్చావో, నీకు తలుపు తెరవను," అని జురేక్ భార్య వెనక నుంచి కేక పెట్టింది.

దీనారాల సంచీ కోసం మూడుసార్లు ప్రయత్నించిన దెవరో జురేక్‌కు స్పష్టంగా తెలును. ఆ కుర్రాడు అహ్మద్ ఇంట ఉంటున్న మాట కూడా ఆయన ఎరుగును. అందుచేత ఆయన అడ్డదార్ల వెంబడి త్వరగా అహ్మద్ ఇల్లు చేరి, మారుతాళం చెవితో బయటి తలుపు తెరిచి, లోపలికి వెళ్ళి మళ్ళీ తలుపు మూసి, పాదరసం రాక కోసం ఎదురు చూడసాగాడు.

కొద్దిసేపట్లో పాదరసం వచ్చి తలుపు తట్టాడు.

జురేక్ అహ్మద్ కంఠస్వరాన్ని అనుకరిస్తూ, "పాదరసం, నువేనా? .... సంచీ తెచ్చావా? ....ఏదీ? తలుపు కిందుగా లోపలికి తొయ్యి! నేనూ, హసనూ పందెం వేసుకున్నాంలే! గమ్మత్తయిన పందెం! తలుపు తెరిచి అంతా చెబుతా!" అన్నాడు.

తలుపు అవతల ఉన్నది అహ్మదే అని నమ్మి, "పాదరసం" తాను తెచ్చిన సంచీని తలుపు కిందుగా లోపలికి తోశాడు.

జురేక్ దాన్ని తీసుకుని, మెట్లెక్కి అహ్మద్ ఇంటి మిద్దె మీదికి పోయి, ఆ మిద్దె మీది నుంచి మరొక ఇంటి మిద్దెకు పోయి, ఆ ఇంటి మెట్లు దిగి, తలుపు తెరుచుకుని వీధిలోకి వెళ్ళి, ఇంటిదారి [illegible]డు.

"పాదరసం" ఒకటి రెండుసార్లు తలుపు తట్టి చూశాడు. ఏ అలికిడీ లేదు. జురేక్ తనను మోసగించి ఉంటాడా అని అతనికి అనుమానం కలిగింది. వెంటనే పరిగెత్తుతూ అడ్డదార్ల వెంట జురేక్ ఇల్లు చేరాడు. అతను లోపల ప్రవేశించి చూస్తే, మేడ మీది గదిలో జురేక్ భార్య పిల్లవాణ్ణి పెట్టుకుని నిద్ర పోతున్నది.

ఆమె లేచే లోపల పాదరసం ఆమె చేతులూ, కాళ్ళూ కట్టేసి, పిల్లవాణ్ణి ఒక తట్టలో పడుకోబెట్టి, జురేక్ రాక కోసం నిలబడ్డాడు.

ఇంతలో జురేక్ ఇల్లు చేరుకుని తలుపు తట్టాడు.

"పాదరసం" జురేక్ భార్య కంఠాన్ని అనుకరిస్తూ, "సంచీ దొరికిందా?" అని అడిగాడు.




"దొరక్కేంచేస్తుంది! ఇదుగో, తెచ్చాను," అన్నాడు జురేక్.

"సంచీని బుట్టలో పెట్టు, డబ్బు లెక్క చూసుకు! మరీ తలుపు తెరుస్తాను," అంటూ పాదరసం ఒక బుట్టకు తాడుకట్టి కిందికి దించాడు. జురేక్ తన దీనారాల సంచీని ఆ బుట్టలో పెట్టాడు.

పాదరసం ఆ బుట్టను చేదుకుని, దీనారాల సంచీనీ, పిల్లవాడున్న తట్టనూ తీసుకుని, ఇళ్ళకప్పుల మీదుగా అహ్మద్ ఇంటికి వెళ్ళిపోయాడు.

ఎంతకూ తలుపు తెరుచుకోకపోవటం చూసి జురేక్ తన తలవాకిలి తలుపును



బాదసాగాడు. చుట్టుపక్కలవాళ్ళంతా పోగయారు. చివరకు నలుగురూ కలిసి తలుపు పడదోసి, లోపలికి వెళ్ళి చూసేసరికి, జురేక్ భార్య మంచానికి కట్టేసి ఉన్నది.

డబ్బుసంచీ జాడలేదు. పిల్లవాడూ లేడు.

జురేక్ తన భార్య కట్లువిప్పి, ఆమె ద్వారా జరిగినదంతా తెలుసుకున్నాడు. ఆయన జుట్టు పీక్కుని, అహ్మద్ ఇంటికి వెళ్ళి, తలుపు తట్టాడు.

అప్పటికి తెల్లవారుతున్నది. అహ్మద్ ఇంట అందరూ మేలుకునే ఉన్నారు.

జురేక్ "పాదరసం" అలీని చూస్తూనే, "డబ్బుసంచీ నువు గెల్చుకున్నావు. నువే ఉంచుకో. కాని నా పిల్లవాణ్ణి నా కిచ్చెయ్యి, నీకు పుణ్యం ఉంటుంది!" అన్నాడు.

హసన్ జురేక్‌తో, "తొందరపడకండి. మీ డబ్బుసంచీ ఎక్కడికీ పోదు. మీ పిల్లవాడూ ఎక్కడికీ పోడు. మావాడికీ, మీ మేనగోడలు జీనాబ్‌కూ పెళ్ళి ఖరారు చేసి మరీ వెళ్ళండి!" అన్నాడు.

"ఏమిటి మీరనేది? జీనాబ్‌ను అలీ కిచ్చి పెళ్ళిచెయ్యటానికి నాకేం అభ్యంతరం? కాని జీనాబ్ సంతలో కొనే గొర్రె పిల్లలాటిది కాదు. దాన్ని పెళ్ళాడ గోరినవాడు తగిన భరణం ఇవ్వవలసి ఉంటుంది," అన్నాడు జురేక్.

"ఆ భరణం ఏమిటో చెప్పండి, తప్పక ఇస్తాను," అన్నాడు "పాదరసం".


"అబరయ్యా కూతురు కమర్ దగ్గర ఉన్న బంగారు దుప్పటి, ఆమె ధరించే బంగారు శిరోభరణమూ, బంగారు వడ్డాణమూ, బంగారు చడావులూ తెచ్చి ఇచ్చినవాణ్ణి జీనాబ్ లక్షణంగా పెళ్ళాడుతుంది," అన్నాడు జురేక్.

"అలాగే తెచ్చి ఇస్తాను," అన్నాడు "పాదరసం".

జురేక్ తన డబ్బుసంచీనీ, పిల్లవాణ్ణీ తీసుకుని వెళ్ళిపోయాడు.

హసన్ పాదరసం కేసి తిరిగి, "నువ్వు ఈసారి తలకు మించిన పని మీద వేసుకున్నావు. అజరయ్యా అంటే ఏమిటనుకున్నావు? అతను మంత్రాలూ, చేతబడులూ చేయగలవాడు. అతనికి భూతపిశాచాలు పలుకుతాయి. అతను తన ఇంటినే బాగ్దాదు నగరం వెలపల, వెండి, బంగారు ఇటుకలతో కట్టించాడు. అతను పగలల్లా నగరంలో వడ్డీ వ్యాపారం చేసి, రాత్రి ఇంటికి వస్తాడు. రాత్రిపూట అతను ఇంట్లో ఉన్నప్పుడు తప్పిస్తే అతని ఇల్లు ఎవరికీ కనిపించదు. రాత్రివేళ అతను ఇంటికి రాగానే, గవాక్షంలో నిలబడి, ఒక బంగారు పళ్ళెంలో తన కుమార్తె బంగారు దుప్పటి ఉంచి చేత పట్టుకుని, 'ఇరాక్, ఇరాన్, అరేబియాలలో గల ఏ గజదొంగ అయినా సరే దీన్ని చాతనైతే కాజెయ్యవచ్చు," అని ప్రకటిస్తాడు. ఎంతమందో గజదొంగలు ఆ దుప్పటి కాజెయ్యాలని ప్రయత్నించి నాశనమై పోయారు. నిన్ను కూడా నాశనం చెయ్యాలనే ఉద్దేశంతోనే జారేక్ ఈ పెటకం పెట్టాడు!" అన్నాడు.

"మాట ఇచ్చేశాను. జీనాబ్‌ను పెళ్ళికూతుర్ని చేసినప్పుడు ఆ బంగారు దుప్పటి కప్పి, బంగారు శిరోభరణం పెట్టి, బంగారు వడ్డాణం చుట్టి, బంగారు చదావులు తొడిగి





మరీ పెళ్ళాడతాను," అన్నాడు "పాదరసం" ధైర్యంగా.

అతను అప్పటికప్పుడే బయలుదేరి, నగరంలో ఉన్న అజరయ్యా దుకాణానికి వెళ్ళాడు. అజరయ్యా దుకాణం మూసే దాకా అతను దూరంగా వేచి ఉన్నాడు. అజరయ్యా బంగారాన్ని తూయించి, సంచులలో పెట్టి గాడిద మీద వేయించి, దుకాణం మూసి, ఆ గాడిద నెక్కి బయలుదేరగానే, "పాదరసం" అయన వెనకగా నగరం వెలపలికి వెళ్ళాడు.

అజరయ్యా ఒకచోట ఆగి, తన చేతి సంచీలో నుంచి ఇసుక తీసి, మంత్రించి, గాలిలో చల్లాడు. వెంటనే అయన ఎదట ఒక భవనం ప్రత్యక్షమయింది. అదే వెండి, బంగారు ఇటుకలతో కట్టిన భవనం. అజరయ్యా గాడిదతో సహా భవనం ప్రవేశించాడు.

కొంతసేపయాక అయన కిటికీ వద్ద కనిపించాడు. అయన చేతిలో ఒక బంగారు పళ్ళెమూ, అందులో ఒక బంగారు దుప్పటీ ఉన్నాయి. అయన పళ్ళెం పట్టుకుని, "ఇరాక్, ఇరాన్, అరేబియాలలో గల గజదొంగలారా! చేతనైతే ఈ నా కుమార్తె సొత్తు దొంగిలించి, ఆమెను పెళ్ళాడండి!" అని కేక పెట్టాడు.

అజరయ్యాను మంచిగా అడిగి ఆ వస్తువులు తీసుకుందామని "పాదరసం" అలికిడి చేసింది. అతను కింది నుంచి, "అయ్యా, తమతో కాస్త మాట్లాడాలి!" అన్నాడు.

"పైకి రా," అన్నాడు అజరయ్యా.

పాదరసం పైకి వెళ్ళి, అజరయ్యాకు తన సమస్య గురించి తెలిపాడు.

అజరయ్యా గట్టిగా నవ్వి, పాదరసం చెయ్యి తీసుకుని పరీక్షించి, "నీకు ప్రాణం మీద ఆశ ఉంటే ఈ ప్రయత్నం మానుకో. నిన్ను చంపించాలనే ఎవరో నీకి ప్రేరణ కలిగించారు. అయితే నీకు నాకన్న హెచ్చు ఆయుర్దాయం ఉన్నది. లేనట్లయితే నిన్ను

ఈ క్షణంలోనే చంపి, దూరంగా పారేసి ఉండేవాణ్ణి," అన్నాడు.

"పాదరసం" మండిపడి, కత్తి దూస్తూ, "నే నడిగినది ఇస్తావా? లేక నీ ప్రాణం తీసేదా?" అన్నాడు.

"ఆ చెయ్యి పడిపోవాలి!" అన్నాడు అజరయ్యా. మరుక్షణం "పాదరసం" కుడి చెయ్యి చచ్చుబడింది.

అతను కత్తిని ఎడమ చేతిలోకి తీసుకున్నాడు. కాని అజరయ్యా దాన్ని కూడా చచ్చుబడిపోయేటట్టు చేశాడు.

"ఇకనైనా నీ ఆలోచన వదులుకుంటావా?" అన్నాడు అజరయ్యా "పాదరసం"తో.

"నాకా దుప్పటీ, నగలూ కావాలి!" అన్నాడు "పాదరసం" మొండిగా.

"అలా అయితే గాడిదవై, వాటిని మొయ్యి!" అంటూ అజరయ్యా "పాదరసం" మీద నీరు చల్లాడు. "పాదరసం" గాడిదగా మారిపోయాడు.

మర్నాడు అజరయ్యా తన దుకాణానికి "పాదరసం" అలీని తోలుకుపోయాడు; సాయంకాలం ఇంటికి తిరిగివచ్చినాక, అతన్ని మళ్ళీ మనిషిని చేసి, "వృథాగా చెడిపోక, ఇంటికి పో. కావాలంటే నిన్ను



గాడిద కన్న కూడా ఇంకా హీనప్రాణిగా మార్చగలను," అన్నాడు.

ఈ మాట విని "పాదరసం" భయపడటానికి మారుగా, ఉద్రేకం చెంది, అజరయ్యా పైన కలియబడ్డాడు. అజరయ్యా అతన్ని ఎలుగుబంటిగా మార్చేశాడు.

మర్నాడు అజరయ్యా కూతురు కమర్ తన తండ్రిని, "నాన్నా, ఈ అబ్బాయి నన్ను పెళ్ళాడతాడేమో కనుక్కో!" అన్నది.

"నువే కనుక్కో!" అని అజరయ్యా కోపంగా తన గదికి వెళ్ళిపోయాడు.

"నీకు కావలసింది నేనా, లేక నా వస్తువులా?" అని కమర్ అలీని అడిగింది.

"నీ వస్తువులే! వాటిని నేను దిలైలా కూతురు జీనాబ్ అనే సౌందర్యవతికి భరణంగా ఇవ్వాలి," అన్నాడు "పాదరసం".

"వాడి మనసు మారదు," అంటూ అజరయ్యా "పాదరసం" అలీని కోతిగా మార్చాడు.

కమర్ ఒక నిశ్చయానికి వచ్చింది— అతను తనను పెళ్ళాడకపోయినా, అతను కోరిన వస్తువు లిచ్చి, అతనికి సుఖం చేకూర్చ నిశ్చయించుకున్నది. ఆమె ఎంతో కష్టం మీద తన తండ్రిని ఒప్పించి, తన వస్తువులను అతనికి ఇచ్చేస్తూ, "వీటితో నువు నీ జీనాబ్‌ను పెళ్ళాడు," అన్నది.

"పాదరసం" అలీకి కమర్ మీద చాలా అభిమానం కలిగింది. అతను కమర్‌ను వెంటబెట్టుకుని, అహ్మద్ హసన్‌ల వద్దకు వెళ్ళి, జరిగినదంతా చెప్పారు.

"నువు జీనాబ్‌ను పెళ్ళాడినాక, కమర్‌ను కూడా పెళ్ళాడటం భావ్యంగా ఉంటుంది. అజరయ్యా ఆస్తికంతకూ ఆమె వారసురాలు," అన్నారు వాళ్ళు.

వాళ్ళు దిలైలానూ, జీనాబ్‌నూ, జురేక్‌నూ పిలిపించి, "పాదరసం" జీనాబ్ కోసం తెచ్చిన భరణం చూపి, పెళ్ళికి ఒప్పించారు. ఆ భరణం ఎలా లభించినదీ తెలుసుకుని జీనాబ్, "పాదరసం" కమర్‌ను కూడా పెళ్ళాడటానికి సమ్మతించింది.

"పాదరసం" జీనాబ్‌నూ, కమర్‌నూ పెళ్ళాడాడు. తరవాత కొంతకాలానికి "పాదరసం" ఖలీఫా కొలువులో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నాడు. అతన్ని పావురాల టపా నిర్వాహకురాలు దిలైలా, ఇద్దరు కొత్వాళ్ళూ శిఫార్సు చేశారు. అందుచేత ఖలీఫా "పాదరసం" అలీని నెలకు వెయ్యి దీనారాల జీతం మీద రాజభటులకు సర్దారుగా నియమించాడు.

"పాదరసం" తన ఇద్దరు భార్యలతో సుఖంగా జీవించాడు. —(అయిపోయింది)

